# క్రమబద్ధ వేదాంతశాస్త్రమును నిర్మించుట

మొదటి పాఠము

## క్రమబద్ధ వేదాంతశాస్త్రము అనగానేమి?

Manuscript

thirdmill

Biblical Education. For the World. For Free.

© 2021 థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

సర్వహక్కులు ప్రచురణకర్తలవే. ఈ ప్రచురణలోని ఏ భాగమైనను ఏ రూపములోనైనను లేదా ఏ సాధనము ద్వారానైనను ప్రచురణకర్తలైన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్, ఐఎన్సి, 316 లైవ్ ఓక్స్ బిఎల్విడి, కాసిల్ బెర్రీ, ఫ్లోరిడా 32707, నుండి వ్రాతపూర్వకమైన అనుమతి పొందకుండా పునఃసమీలలో క్లుప్తంగా ఉల్లేఖింపబడుట, వ్యాఖ్యానించుట, లేదా పాండిత్యము సంపాదించు ఉద్దేశం కొరకు మినహా పునఃర్ముద్రింపకూడదు.

మరొక విధంగా సుచింపబడితే తప్ప ఇందులోని లేఖన ఉల్లేఖనములన్నియు తెలుగు OV వెర్షన్ నుండి తీసికొనబడినవి. కాపిరైట్ © ది బైబిల్ సొసైటీ అఫ్ ఇండియా.

## థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్

1997లో స్థాపించబడిన థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ఒక లాభాపేక్షలేని ఇవాంజెలికల్ క్రైస్తవ పరిచర్యగా లోకమునకు ఉచితముగా బైబిలు సంబంధమైన విద్యను అందించుటకు ప్రతిష్టింపబడింది.

**బైబిలు విద్య. లోకము కొరకు. ఉచితముగా.**

ప్రపంచవ్యాప్తముగా పరిచర్య కొరకు తగిన తర్ఫీదులేని కొన్ని వందల వేల మంది క్రైస్తవ నాయకులకు ఉచిత క్రైస్తవ విద్యను అందించుట మా లక్ష్యమైయున్నది. ఆంగ్లము, అరబిక్, మాండరిన్, రష్యన్, మరియు స్పానిష్ భాషలలో సాటిలేని మల్టీమీడియా సెమినారిని సిద్ధపరచి, విశ్వవ్యాప్తముగా పంచిపెట్టుట ద్వారా మేము ఈ లక్ష్యమును చేధించుచున్నాము. మా పరిచర్య భాగస్వాముల ద్వారా మా పాఠ్యాంశములు ఒక డజను కంటే ఎక్కువ భాషలలో ప్రస్తుతము అనువదించబడుచున్నాయి. ఈ పాఠ్యాంశములలో చిత్రములతో కూడిన వీడియోలు, ముద్రించబడిన ఉపదేశములు, మరియు ఇంటర్నెట్ వనరులు ఉన్నాయి. పాటశాలలు, సమూహములు, మరియు వ్యక్తులు ఆన్లైన్ లో మరియు అధ్యయనము చేయు సమాజములలో ఉపయోగించుటకు అనుగుణంగా ఇవి రూపొందించబడినవి.

అనేక సంవత్సరాలుగా, అవార్డులు సంపాదించిన అత్యుత్తమమైన విషయములు మరియు నాణ్యతగల మల్టీమీడియా పాఠములను ఉత్పత్తి చేయుటకు తగుమాత్రపు ఖర్చుతో కూడిన పద్ధతిని మేము అభివృద్ధి చేశాము. మా రచయితలు మరియు సంపాదకులు వేదాంతవిద్యలో తర్ఫీదు పొందిన విద్యావేత్తలు, మా అనువాదకులు వేదాంత ప్రావీణ్యతకలిగి తాము అనువదించు భాషలలో మాతృభాషా నైపుణ్యత కలిగియున్నవారు, మరియు మా పాఠములు లోకవ్యాప్తముగా అనేక సెమినారీలలో బోధించు వందలమంది గౌరవనీయులైన అధ్యాపకులు మరియు కాపరుల యొక్క మెళకువలను కలిగియున్నాయి. ఇంతేగాక, మా గ్రాఫిక్ డిజైనర్లు, ఉదాహరణలను ఇచ్చువారు, మరియు ప్రొడ్యుసర్లు అద్భుతమైన పరికరములను మరియు టెక్నిక్లను ఉపయోగించి ఉన్నతమైన ప్రమాణములతో పనిచేస్తారు.

మా డిస్ట్రిబ్యూషన్ లక్ష్యములను చేధించుటకు, సంఘములతో, సెమినారీలతో, బైబిల్ కళాశాలలతో, మిషనరీలతో, క్రైస్తవ బ్రాడ్కాస్టర్లతో, శాటిలైట్ టెలివిజన్ వారితో, మరియు ఇతర సంస్థలతో థర్డ్ మిలీనియం వ్యూహాత్మక భాగస్వామ్యములను కలిగియున్నది. ఈ భాగస్వామ్యములు ఇప్పటికే లెక్కలేనన్ని వీడియో పాఠములను స్థానిక నయాకులు, కాపరులు, మరియు సెమినరీ విద్యార్థులకు పంచుటకు

కారణమైయ్యాయి. మా వెబ్సైటులు కూడా డిస్ట్రిబ్యూషన్ కు మాధ్యమాలుగా ఉండి, మా పాఠములతో పాటుగా సహాయకరముగా ఉండుటకు అదనపు వనరులను కూడా అందించుచున్నవి. ఉదాహరణకు, మీ సొంత అధ్యయన సమాజమును ఆరంభించుటను గూర్చిన వనరులు.

థర్డ్ మిలీనియం IRS 501(c)(3) కార్పోరేషన్ గా గుర్తింపుపొందినది. మేము సంఘములు, సంస్థలు, వ్యాపారములు, మరియు ప్రజలు వ్యక్తిగతంగా ఇచ్చు టాక్స్-మినహాయింపైన కానుకల మీద ఆధారపడి పనిచేస్తాము. మా పరిచర్యలను గూర్చి అదనపు సమాచారము కొరకు మరియు మీరు మాతో కలసి పరిచర్య చేయు మార్గములను తెలుసుకొనుటకు, ఈ వెబ్సైటును దర్శించండి http://thirdmill.org.

# విషయ సూచిక


ఉపోద్ఘాతము ........ 1
క్రొత్త నిబంధన ........ 2
క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము........ 2
బైబిలు ప్రకారము ........ 3
తార్కికము........ 4
సాంప్రదాయ ........ 5
క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము ........ 6
వైవిధ్యం........ 6
సేవకునికి సంబంధించినదిగా దాని లక్షణము ........ 7
కళా ప్రక్రియలు........ 8
సామాన్య అమరిక........ 9
చారిత్రక అభివృద్ధులు ........ 10
సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము ........ 12
సాంస్కృతిక మార్పులు ........ 12
వేదాంతశాస్త్ర మార్పులు ........ 13
మధ్యయుగ వేదాంతశాస్త్రము ........ 17
సాంస్కృతిక మార్పులు ........ 17
వేదాంతశాస్త్ర మార్పులు ........ 18
ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రము........ 23
ప్రారంభ సంస్కర్తలు........ 23
సాంప్రదాయిక ఒప్పుకోలులు........ 25
ఆధునిక క్రమబద్ధతలు........ 26
విలువలు మరియు ప్రమాదాలు........ 28
క్రైస్తవ జీవనము........ 29
మెరుగుపరచుట........ 29
అవరోధము........ 30
సమాజములో పాలుపంపులు ........ 31
మెరుగుపరచుట........ 31
అవరోధము........ 32
లేఖన వివరణ........ 33
మెరుగుపరచుట........ 34
అవరోధము........ 34
ముగింపు ........ 35





వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

# క్రమబద్ధ వేదాంతశాస్త్రమును నిర్మించుట

మొదటి పాఠము

క్రమబద్ధ వేదాంతశాస్త్రము అనగానేమి?

## ఉపోద్ఘాతము

అస్తవ్యస్తంగా ఉన్న గదిలో నిలువలేని వ్యక్తిని గూర్చి మీకు తెలుసా? ఆ విధముగా ఉండే ఒక వ్యక్తిని కళాశాల వసతి గదిలో సహచరునిగా నేను కలిగియుండేవాడిని. తరచు నేను నా బల్లమీద వస్తువులను గజిబిజిగా పడవేసి తరగతి గదికి వెళ్లేవాడిని, కానీ అతడు దానిని శుభ్రపరుస్తూ ఉండేవాడు. మరుసటి దినము కూడా అదే విధముగా వస్తువులను వదిలేసి వెళ్లేవాడిని మరియు అతడు మరలా శుభ్రపరుస్తూ ఉండేవాడు. ఒక దినమున నేను మా వసతి గది నుండి వెలుపలకు వెళ్లేడప్పుడు అతడు నన్ను ఆపివేసి ఈ విధముగా అడిగాడు “నీకు ఏమైంది? ఎక్కడి వస్తువులు అక్కడ పెట్టడం నీకు తెలియదా?”

“అవును,” అని నేను ఒప్పుకున్నాను, “ఎక్కడ వస్తువులు అక్కడ పెట్టడం నాకు తెలుసు కానీ ఇంకా చేయవలసిన కార్యములు నాకు చాలా ఉన్నాయి అవి చేసే సమయం నాకు లేదు.”

అతడు ఇచ్చిన సమాధానం నాకు ఇప్పటికీ జ్ఞాపకముంది: “ఎక్కడ వస్తువులు అక్కడ పెట్టడానికి నీవు కొన్ని నిమిషాలు వెచ్చిస్తే, ఇంకా ఎన్ని పనులు చేయవచ్చునో అని నీవు ఆశ్చర్యపడతావు.”

మంచిది, చాలా విధాలుగా నా స్నేహితుడి ఆలోచన క్రైస్తవ వేదాంతశాస్త్రమునకు అనువర్తించబడుతుంది. క్రీస్తు కొరకు సమయము తీసుకొని తమ వేదాంతశాస్త్రమును నిలకడగా ఉంచుటకు చాలా జరుగవలసి ఉన్నదని చాలామంది క్రైస్తవులు ఆలోచిస్తున్నారు. నశించబడినవారిని గెలవడము, సంఘములు స్థాపించడము, లేఖనములను బోధించడము... ఇంకా చేయవలసినవి చాలా ఉన్నవి. కానీ వాస్తవమేమంటే మన వేదాంతశాస్త్రమును క్రమముగా ఏర్పాటు చేయడానికి సమయము కేటాయించగలిగితే, క్రీస్తు సేవ మరియు ఆయన రాజ్యము కొరకు మరింత చేయవచ్చును.

క్రమబద్ధమైన వేదాంత శాస్త్రమును నిర్మించుట అను మన పాఠ్య క్రమములో ఇది మొదటి పాఠము. ఈ పాఠ్య క్రమములో మనము క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము లేదా “క్రమబద్ధములు” అనువాటిని అన్వేషించుదాము. క్రైస్తవ సంఘము యొక్క వేదాంతశాస్త్రమును క్రమపరచుటలో పరిశుద్ధాత్మ సంఘమును నడిపించిన ప్రధానమైన మార్గములలో క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము ఒకటిగా ఉన్నది. “క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము అనగానేమి?” అని ఈ పాఠమునకు పేరు పెట్టాము. ఈ పరిచయ పాఠంలో, క్రమబద్ధమైన వేదాంతశాస్త్ర అధ్యయనానికి సంబంధించిన అనేక ప్రాముఖ్యమైన విషయాలను మనము అన్వేషించుదాము.

మన పాఠం మూడు ప్రధాన అంశములను గూర్చి మాట్లాడుతుంది: మొదటిగా, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమును క్రమబద్ధమైన వేదాంతశాస్త్రముతో పోల్చుదాము. వాటి యొక్క సారూప్యతలు మరియు వ్యత్యాసములు ఏలా ఉన్నాయి? రెండవదిగా, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమునకు నడిపించిన చారిత్రక అభివృద్ధులను చూద్దాము. అది ఎక్కడ నుండి వచ్చింది? మూడవదిగా, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క విలువలను మరియు ప్రమాదములను చూద్దాము. ఈ క్రమశిక్షణ యొక్క



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ప్రయోజనములు మరియు నిష్ప్రయోజనములు ఏమిటి? క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము మధ్య సంబంధమును గూర్చి అన్వేషించుటతో ప్రారంభించుదము.

## క్రొత్త నిబంధన

క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము మధ్య సంబంధముతో ఆరంభించుట ప్రాముఖ్యమైయున్నది ఎందుకనగా క్రీస్తు అనుచరులముగా మనము లేఖనము యొక్క నిస్సందేహమైన అధికారమునకు కట్టుబడియున్నాము, వేదాంతశాస్త్రము యొక్క ఏ ఇతర వ్యవస్థకు కాదు, అవి మంచివైనప్పటికీ కూడా. బైబిలు మినహా అన్ని వేదాంతశాస్త్ర క్రమములు మానవుల అపరిపక్వ పాప స్వభావమును ప్రతిబింబిస్తాయి. కాబట్టి, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును బైబిలుకు ఎలా సరిపోల్చవచ్చునో చూచుటకు మనము ఆసక్తిని చూపించాలి. అది ఏ విధముగా లేఖనమును పోలియున్నది? అది ఏ విధముగా లేఖనములకు వేరుగా ఉన్నది?

క్రమబద్ధములు మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమునకు మధ్య సంబంధమును చూచుటకు, మనము రెండు విషయాలను అన్వేషించాలి, మొదటిగా క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క హద్దులు మరియు రెండవదిగా, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము యొక్క హద్దులు. క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క హద్దులను మొదటిగా చూద్దాము.

### క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము

చారిత్రాత్మకంగా మాట్లాడితే, క్రైస్తవులు వేదాంతశాస్త్రమును నిర్మించుట యొక్క అతి ప్రాముఖ్యమైన విధానములలో క్రమబద్ధమైన వేదంతశాస్త్రము ఒకటిగా ఉన్నది. వాస్తవానికి, క్రమబద్ధముల చేత ప్రభావితము చేయబడని క్రీస్తు అనుచరుడిని ఈ లోకములో కనుగొనడము కష్టము. ఒకే సారమును పంచుకొను ముగ్గురు పురుషమూర్తులుగా ఉన్నాడని, దేవుడు త్రిత్వము అని మనము మాట్లాడున్నప్పుడు, మనము క్రమబద్ధమైన వేదాంతపండితుల యొక్క పని మీద ఆధారపడుతున్నాము; పరిపూర్ణ మానవత్వము మరియు దైవత్వము కలిగిన క్రీస్తు అను అద్వితీయుని గూర్చి మనము మాట్లాడుచున్నప్పుడు, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో వర్ణించబడిన సిద్ధాంతములతో మనము పనిచేస్తున్నాము. పునరుత్పత్తి, విశ్వాసము, మారుమనస్సు, పవిత్రీకరణ మరియు మహిమపరచబడుట అను పదములను మనము ఉపయోగించినప్పుడు, క్రమబద్ధమైన వేదాంతపండితుల ద్వారా మన కొరకు నిర్వచించబడిన పదములను మనము ఉపయోగించుచున్నాము. అయినను, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము ప్రభావశీలముగా ఉండినప్పటికీ, చాలామంది క్రైస్తవులు నేడు దానిని గూర్చి అస్పష్టమైన ఆలోచనలను కలిగియున్నారు.

మీరు ఊహించినట్లుగా, వేదాంత పండితులు వివిధ రకాలుగా వేదాంతశాస్త్రములో ఈ పద్ధతిని నిర్వచించారు. ఇరవైయవ శతాబ్దము మధ్యలో లూయిస్ బెర్కాఫ్ వ్రాసిన ప్రసిద్ధిచెందిన క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము నుండి వెలువడిన నిర్వచనమును పరిశీలించుట ద్వారా సాంప్రదాయ ప్రొటెస్టెంట్ క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క ముఖ్య విషయాలను మనము గ్రహించగలము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఈ పుస్తకములోని నాలుగవ అధ్యాయములో, బెర్కాఫ్ తన విద్యా శాఖను ఈ విధముగా నిర్వచించాడు:

> క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము క్రైస్తవ మత సిద్ధాంత సత్యములన్నిటి యొక్క క్రమబద్ధమైన ప్రదర్శనను ఇవ్వడానికి ప్రయత్నిస్తుంది.

ఈ సూటియైన నిర్వచనము క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క మూడు అంశములను నొక్కి చెప్తుంది. మొదటిగా, "సత్యము"తోనే సంబంధం కలిగి ఉంటుంది. రెండవదిగా, వివిధ సత్యముల మధ్య తార్కిక సంబంధముల ప్రకారము, "క్రమబద్ధమైన" విధముగా సత్యమును చూపించడానికి ప్రయత్నిస్తుంది. మూడవదిగా, "క్రైస్తవ మతము" నేపథ్యములోనే క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము నిర్మించబడింది.

బెర్కాఫ్ నిర్వచనములోని ఈ విషయాలు మన చర్చను మూడు దిశల్లో నడిపిస్తాయి: మొదటిగా, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము లేఖనములో ఇవ్వబడిన సత్యములను అనుసరిస్తూ బైబిలానుసారముగా ఉండుటకు తారసపడు విధానమును మనము చూద్దాము. రెండవదిగా, ప్రతి విధమైన బైబిలు సత్యము ఇతర సత్యములతో సంబంధించిన విధానమును అర్థము చేసుకొనగల ఒక క్రమమును ఏర్పాటు చేయడము ద్వారా క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము తార్కికంగా పొందికైనదని మనము చూద్దాము. మూడవదిగా, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము సాంప్రదాయ వేదాంతపరమైన ధోరణులను మరియు ప్రాధాన్యతలను అనుసరిస్తున్న విధానములను పరిశీలించుదము. క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము ఖచ్చితముగా బైబిలు ప్రకారముగా ఉండాలను వాస్తవమును మొదటిగా చూద్దాము.

## బైబిలు ప్రకారము

క్రమబద్ధములు "సిద్ధాంత సత్యములతో సంబంధములు కలిగియున్నవని బెర్కాఫ్ చెప్పినప్పుడు ఆయన క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము బైబిలు మీద ఆధారపడుతుందని మాట్లాడుతున్నాడు. *లేఖనములు మాత్రమే* అను సిద్ధాంతమునకు లోబడియున్న ప్రొటెస్టెంట్ వేదాంతపండితులకు, సిద్ధాంత సత్యములపై దృష్టి పెడుతున్నామని చెప్పడమంటే, మా వేదాంతమంతయు బైబిలు మీద ఆధారపడియున్నదని చెప్పడమే. మరియు వాస్తవానికి, క్రమబద్ధమైన సిద్ధాంతములను ఎక్కువగా బైబిలు నుండియే మేము ప్రత్యక్షంగా తీసుకొంటున్నాము. బెర్కాఫ్ ఈ విషయమును స్పష్టముగా *క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో* ఈ వ్యాఖ్యతో తెలిపాడు:

> క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములోని ప్రతి భాగము యొక్క మూలము లేఖనములో నుండియే తీసుకొనబడినదని క్రమబద్ధీకుడు తప్పక చూపించాలి.

దురదృష్టవశాత్తూ, క్రైస్తవులు ఎల్లప్పుడూ క్రమబద్ధమైన వేదంతశాస్త్రమును గూర్చి ఈ విధముగా ఆలోచించలేదు. బైబిలు బోధనలలో క్రమబద్ధీకరణలను స్థిరపరచే క్రమములో కనీసము మూడు ప్రధానమైన దిశలలో వేదాంతపండితులు ఆలోచిస్తున్నారు. కొంతమంది వేదాంతపండితులు క్రమబద్ధతను కేవలము సంఘ సంప్రదాయములలో లేదా సిద్ధాంతములో ఆధారపడినట్లుగా చూస్తారు. ఇవి కేవలము చరిత్రయంతటిలో సంఘ బోధనల యొక్క విశ్లేషణగా వారు చూస్తున్నారు. మరికొంతమంది

వేదాంతపండితులు క్రమబద్ధతలను మతపరమైన అనుభవములలో పాతుకుపోయినట్లు చూస్తున్నారు; ఈ వేదాంతపండితులు మానవుల యొక్క అంతర్బుద్ధులకు మరియు మతపరమైన ఆలోచనలకు క్రమబద్ధమైన క్రమమును తీసుకురావాలని చూస్తున్నారు. ఇంకొంతమంది వేదాంతపండితులు క్రైస్తవ్యమునకు దూరముగా ఉన్నటువంటి తత్వశాస్త్రాలు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము అభివృద్ధిచెందుటకు మూలముగా ఉన్నాయని చూస్తునారు. వాస్తవానికి, ఈ వేదాంతపండితులు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును మత తత్వశాస్త్రములోకి మలుస్తున్నారు.

ఇప్పుడు, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో పాల్గొనిన ప్రతియొక్కరు సంఘ సంప్రదాయము, మత అనుభవము, మరియు తాత్విక పరిగణనలలో కొంతవరకు నిమగ్నమై యున్నారు. అయితే మన పాఠములలో క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును లేఖనముల మీద ఆధారపడిన ఒక క్రమశిక్షణగా నిర్వచించుదాము. క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము అనునది సంఘ సంప్రదాయము, మత అనుభవము, లేదా తత్వములో పాతుకుపోయినట్లుగా మనము చూచుటలేదు. క్రీస్తువలెనే మంచి వేదాంతశాస్త్రమంతయు, క్రమబద్ధమైనదానితో సహా బైబిలానుసారమైనదని మనము అర్ధము చేసుకోవాలి.

ఇప్పటివరకు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము బైబిలానుసారముగా ఉండుటకు తృష్ణతో ఉన్నదని మనము చూచాము, ఇప్పుడు క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము లేఖన బోధలను క్రమముగా అమర్చుతూ, తార్కికముగా సామరస్యం కలిగి ఉండుటకు ప్రయత్నిస్తున్న విధానమును చూచుదము.

## తార్కికము

బెర్కాఫ్ నిర్వచనము చూపుచున్నట్లుగా, ఈ క్రమశిక్షణ "సిద్ధాంత సత్యముములన్నిటి యొక్క *క్రమబద్ధమైన* ప్రదర్శనను" చేయడానికి చూస్తుంది. లేదా, మరొకచోట ఆయన వివరించినట్లుగా:

> క్రమబద్ధీకుడు ... సిద్ధాంత సత్యములను క్రమబద్ధతల సంపూర్ణతలో కలిపేందుకు చూస్తున్నాడు.

ఈ వీక్షణలో, క్రమబద్ధమైన వేదాంతశాస్త్ర పండితుని యొక్క పని ఏమనగా, క్రైస్తవ విశ్వాసములను సంగ్రహముగా చూపించాలి తద్వారా అవి ఒక సమగ్ర, క్రమబద్ధమైన, తార్కిక, వ్యవస్థగా ఏర్పాటు చేయబడతాయి. లేఖన బోధనలు ఏకీకృత తార్కిక వ్యవస్థగా ఎలా ప్రత్యక్షపరచబడతాయో క్రమబద్ధీకులు స్పష్టము చేయగలరు.

ప్రతి యుగములో, చాలామంది క్రైస్తవులు సాపేక్షంగా విడదీయబడిన తమ నమ్మకములను విడిచిపెట్టుటలో తృప్తిచెందారు. దేవునిని గూర్చిన కొన్ని విషయాలను మనము నమ్ముతాము. విశ్వాసము మరియు రక్షణను గూర్చిన ఇతర విషయాలను మనము నమ్ముతాము. నైతికత మరియు నీతిని గూర్చి ఇతర నమ్మకాలు మనకు ఉన్నాయి. ఎక్కువమంది క్రైస్తవులు అనేక విషయాలను నమ్ముతున్నప్పటికీ, మన నమ్మకములు ఒకదానికొకటి పొంతనలేకుండా ఉండునట్లు మనము అవకాశమిస్తాము.

విరుద్ధంగా, క్రైస్తవ నమ్మకముల యొక్క అనుబంధమును చూపడానికి క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము ఒక ఉన్నతమైన ప్రణాళికను కలిగియున్నది. క్రమబద్ధీకులు ఒకదానితోనొకటి కలిగిన తార్కిక సంబంధమును వివరించే మరియు బోధించే లేఖనముల యొక్క ముక్కలను మరియు తునకలను తీసుకొని సాధ్యమైనంత స్థిరముగా మరియు సమగ్రముగా తీసుకురావాలని కోరుతున్నారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వాస్తవానికి, ఖచ్చితంగా ఇందు మూలముగానే ఈ విద్యా విషయమును *క్రమబద్ధ*మైన వేదాంతశాస్త్రము అని పిలుస్తారు. బైబిలు ద్వారా బోధించబడిన వేదాంతశాస్త్రము యొక్క క్రమబద్ధతను ప్రత్యక్షపరచడమే దీని యొక్క లక్ష్యము.

మూడవ స్థానములో, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము కేవలము బైబిలానుసారముగా మరియు తార్కిక సామరస్యంగా ఉండుటకు మాత్రమే ప్రయత్నించడం కాదుగానీ, సాంప్రదాయ క్రైస్తవ విషయాలతో కొనసాగింపును కలిగియుండుటకు కూడా ప్రయత్నిస్తుంది, మరియు సంఘమునకు ప్రాముఖ్యమైనవిగా చరిత్ర చూపించిన సిద్ధాంతములపై దృష్టిని కేంద్రీకరిస్తుంది.

## సాంప్రదాయ

క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము "క్రైస్తవ మతమునకు" సంబంధించిన సిద్ధాంత సత్యములను గూర్చి చర్చిస్తుందని చెప్తూ బెర్కాఫ్ నిర్వచనము ఈ విషయమును ప్రస్తావిస్తుంది.

ఈ విధముగా తన నిర్వచనము యొక్క ఈ అంశముపై ఆయన విశదీకరించాడు:

> **"భూతకాలమును గూర్చిన సైద్ధాంతిక పురోగమనము అనునది అతి పెద్ద తప్పిదము అనే పూర్వ ఆలోచనలో [క్రమబద్ధీకుడు] ... కొనసాగకపోవచ్చును, కాబట్టి ఆయన తన కార్యమును *డి నోవో*గా" లేదా సరికొత్తగా ఆరంభించవలెను.**

క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో, క్రైస్తవ మతము, సాంప్రదాయ వేదాంతపరమైన ధోరణులు మరియు ప్రాధాన్యతలకు సంబంధించిన సిద్ధాంతములను చూచుటకు మనము ప్రయత్నిస్తాము. కాబట్టి, క్రమబద్ధతలు కేవలము బైబిలుతోనే చర్చించడం కాదుగానీ, సంఘ చరిత్రయంతటిలో వేదాంతపండితుల ద్వారా వ్యక్తీకరించబడిన బైబిలు బోధలలోని ప్రధాన విషయాలతో కూడా వ్యవహరిస్తుంది.

ప్రతి నమ్మకమైన ప్రొటెస్టెంట్ క్రమబద్ధ వేదాంతశాస్త్రము ఒకే ప్రాథమిక నిర్మాణమును ఎందుకు అనుసరించుచున్నదో సాంప్రదాయకముపై దృష్టి ఉంచిన ఈ ఆందోళన వివరిస్తుంది. శతాబ్దాలుగా అభివృద్ధి చెందిన వేదాంతపరమైన సమీక్ష యొక్క ముఖ్య ఆందోళనలను అనుసరించి, క్రమబద్ధీకులు సాధారణముగా లేఖన సిద్ధాంతములను ఈ విధముగా నిర్వహిస్తారు: వారు బిబ్లియోలజీ, లేఖన సిద్ధాంతము, లేదా దేవుని గూర్చిన వేదాంతశాస్త్రము, దేవుని సిద్ధాంతముతో ఆరంభిస్తారు. తరువాత మానవశాస్త్రము, మానవసిద్ధాంతము వైపు దృష్టిని మళ్లించి, మరియు రక్షణ కొరకైన మానవుల అవసరతపై ప్రత్యేక దృష్టిని ఉంచుతారు. రక్షణ సిద్ధాంతము తదుపరి రక్షణ శాస్త్రము. అటు తరువాత, సంఘశాస్త్రము, సంఘ సిద్ధాంతము, మరియు చివరగా, రాకడ శాస్త్రము, అంత్య విషయాల సిద్ధాంతము. ఈ ప్రాథమిక క్రమము క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క లక్షణము ఏలయనగా క్రమబద్ధీకులు ఈ ప్రాధాన్యతలను సాంప్రదాయ క్రైస్తవ వేదాంతశాస్త్రము యొక్క ఆకృతుల నుండి పొందుతారు.

కావున, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో కనీసము మూడు ప్రాథమిక లక్షణములను మనము చూడవచ్చు. ప్రొటెస్టెంట్ క్రమబద్ధ వేదాంత పండితులు బైబిలానుసారమైన, తార్కిక సామరస్యమైన, మరియు ప్రాధాన్యతలలోను ప్రాముఖ్యతలలోను సాంప్రదాయికమైన వేదాంతశాస్త్రమును సృష్టించడానికి చూస్తున్నారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇప్పటివరకు మనము క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క ఆకృతులను చిత్రీకరించాము, ఇప్పుడు తదుపరి విషయము వైపు దృష్టి పెడదాము: క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము యొక్క నమూనాలు.

## క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము

వాస్తవానికి, మంచి క్రమబద్ధీకులు పాత నిబంధనతో సహా బైబిలు అంతటికీ ప్రాముఖ్యతనిస్తారు, అయితే ఈ పాఠములో క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము యొక్క పోలికకు మాత్రమే చర్చను పరిమితము చేద్దాము.

అనేక విధాలుగా, బెర్కాఫ్ చెప్పినట్లుగా, క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమను చెట్టు క్రొత్త నిబంధనలో నాటబడినదని ఆలోచించడం సరైనదే. మొదటి స్థానములో, ఈ సారుప్యత సహాయకరముగా ఉంటుంది ఎందుకంటే అది క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము లేఖనము నుండి దాని జీవమును పొందుకొంటుంది అని మనకు జ్ఞాపకము చేస్తుంది. క్రమబద్ధీకులు సాధ్యమైనంతవరకు తమ వాదనలను క్రొత్త నిబంధన ఉద్ఘాటనలకు అనుగుణంగా ప్రయత్నిస్తారు. ఈ కోణములో, మంచి క్రమబద్ధ వేదాంతశాస్త్రము చాలావరకు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము వలె ఉంటుంది.

అయితే రెండవ స్థానములో, చెట్టుమాదిరిగానే, క్రమబద్ధతలు లేఖనమను నేలకు *దూరముగా* మరియు *వెలుపలగా* విస్తరిస్తాయి. అనగా, క్రమబద్ధతలు క్రొత్త నిబంధన నుండి పెరిగినప్పటికీ, క్రొత్త నిబంధనకు భిన్నమైనవిగా పెరిగాయి.

ఈ భిన్నత్వములను చూచుటకు క్రమబద్ధతలకు మరియు క్రొత్త నిబంధన వేదాంతమునకు మధ్య వ్యత్యాసమును చూపించు నాలుగు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్ర విశేషాలను చూద్దాము: మొదటిది, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్ర సాపేక్ష వైవిధ్యం; రెండవది, క్రొత్త నిబంధన యొక్క కాపరి లక్షణము; మూడవది, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమును వ్యక్తీకరించడానికి ఉపయోగించబడిన శైలులు; మరియు నాల్గవది, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము యొక్క ప్రాథమిక నిర్మాణము. క్రొత్త నిబంధనలో మనకు అగుపడు విభిన్న పదజాలము మరియు వర్గాలతో ఆరంభించుదము.

### వైవిధ్యం

మనము చూచినట్లుగా, సంఘ చరిత్రలో మరియు కాలములో చర్చించబడిన అంశముల చుట్టూ క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము నిర్మించబడినది. క్రమబద్ధీకులందరూ క్రమంగా అనుసరించే ఈ సుదీర్ఘ చరిత్ర ఒకే రీతియైన షరతులను మరియు విభాగాలను సృష్టిస్తుంది. ఖచ్చితముగా చెప్పాలంటే, వివిధమైన క్రమబద్ధతగల వేదాంత శాస్త్రజ్ఞులు అందరు కూడా వివిధమైన విధాలలో తమను తాము వ్యక్తపరచుకొంటుంటారు; వారు దృఢముగా ఒకేరీతిగా ఉండువారు కారు. కాని క్రమబద్ధమైనవన్నిటినీ సమూలంగా తీసుకుంటే అవి ఎంతటి ప్రామాణికమైనవంటే పదములు మరియు విభాగములు కూడా దరిదాపు ఒకేవిధంగా ప్రయోగించబడినవిగా ఉంటాయి.

ఇట్టి సుదీర్ఘమైన ఏకత్వాన్ని క్రొత్త నిబంధన ప్రతిబింబించదు. క్రమబద్ధమైన వేదాంతశాస్త్రములో కంటే కూడా క్రొత్త నిబంధనలో ఈ పదముల మరియు విభాగముల భిన్నత్వాలు ఎక్కువగా ఉన్నాయి. ఇప్పుడు, ఈ విషయాన్ని ఎక్కువగా వక్కాణించకుండా మనము జాగ్రత్త వహించాలి. అనేకమైన కేంద్రీకృత



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మరియు సాధారణ క్రైస్తవ విషయాలలో, క్రొత్తనిబంధన రచయితలు ఒక సామాన్యమైన పదజాలమును, భావాలను మరియు భావనిర్మాణాలను ఉపయోగిస్తారు. క్రొత్తనిబంధనలోని వేదాంతశాస్త్రములో ఏకత్వమే లేనంతగా చాలా ద్రవత్వము ఉన్నదని కాదు.

ఉదాహరణకు, పాతనిబంధనలోని బోధనల ఆధారముగా వారందరు కూడా దేవుని అనేకానేక విధాలలో వివరించారు. యేసు క్రీస్తు అనియు లేదా మెస్సీయ అనియు భావించి దీనికి అర్థము ఏమైయుంటుందో అనేదానిపై సామాన్య నమ్మకాలను కూడా కలిగియున్నారు. పాపము మరియు రక్షణ అనే పదాల యొక్క సాధారణ అర్థము విషయములో వారు ఏకీభవించారు. ఇట్టి ఏకత్వాల జాబితా చాలా విస్తారమైనదిగానే ఉంటుంది.

అయినప్పటికీ, ఈ ఏకత్వాలతోనే, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము చాలా వ్యత్యాసమైనదిగా ఉన్నదని స్పష్టమౌతుంది. క్రొత్తనిబంధనలోని వివిధమైన రచయితలు తమ తమ వేదశాస్త్రములను వివిధ రకాలుగా వ్యక్తపరచారు.

వారి వ్యత్యాసములకు ఒక కారణమును ఇంద్రియకమైన ప్రేరణ అనే సిద్ధాంతములో చూడవచ్చు. పొరపాటు మరియు ఒకరితోనొకరు విభేదించడం అనే వాటినుండి పరిశుద్ధాత్ముడు పరిశుద్ధగ్రంథ రచయితలను కాపాడి, క్రొత్తనిబంధన రచయితలు పూర్తిగా ఏకరీతిగా ఉండునంతగా వారి పదజాలమును మరియు విభాగములను ఆయన చదరపరచలేదు. ప్రతి పరిశుద్ధ గ్రంథ రచయిత కూడా తన సొంత నేపథ్యములో నుండి, సొంత వ్యక్తిత్వము మరియు సొంత అనుభవములలో నుండే తమ రచనలు చేసారు. ఫలితముగా, క్రొత్తనిబంధన రచయితలు క్రైస్తవ విశ్వాసమును పరిపూరకరమైనదిగానే వ్యక్తపరచినప్పటికీ, వివిధ మార్గాలలో చేసారు.

ఈ కారణము వలననే, క్రైస్తవ విశ్వాసమును వివరించుటలో పౌలు పద్ధతి లూకా పద్ధతివంటిది కాదు. యోహాను మత్తయి కంటే భిన్నముగా ఉన్నాడు. మార్కు పేతురు కంటే భిన్నముగా ఉన్నాడు. క్రమబద్ధ వేదాంతశాస్త్రములోని విషయాలను అమర్చే ప్రామాణిక విధానాలతో పోల్చిచూస్తే, క్రొత్త నిబంధన వేదాంతము చాలా వ్యత్యాసముగా ఉంది.

వ్యత్యాసమైనదిగా ఉండడముతో పాటు, క్రొత్త నిబంధనలోని వేదాంతము క్రమబద్ధ వేదాంతశాస్త్రము కంటే మరి ఎక్కువగా సేవకులకు సంబంధించినదిగా ఉంటుంది.

## సేవకునికి సంబంధించినదిగా దాని లక్షణము

క్రమబద్ధ వేదాంతశాస్త్రము అనేది హేతుబద్ధమైన స్పష్టత గలదిగా, క్రైస్తవ విశ్వాసము యొక్క బోధనలను సమగ్రముగా వ్యక్తపరచేదిగా నిర్మించబడినది. అది ప్రత్యేకముగా శాశ్వతమైన మరియు సార్వత్రికమైన సత్యములపై దృష్టి నిలుపుతుంది. మరియు ఫలితముగా, అది తరచుగా నైరూప్యమైన మరియు సైద్ధాంతిక నాణ్యతను పొందుతూ, దేవునిపై మరియు పరిహార సిద్ధాంతములపై, సంస్కారాలపై మరియు అనేక ఇతర నైరూప్యమైన విషయాలపై దృష్టి నిలుపుతుంది.

దీనికి విరుద్ధముగా, క్రొత్త నిబంధనలోని వేదాంతశాస్త్రము మాత్రము ఎక్కువగా సేవకునికి సంబంధించినదిగా ఉంటుంది. క్రొత్త నిబంధన రచయితలు తమ వేదాంతమును కొన్ని ప్రత్యేకమైన అవసరతలను, కొన్ని ప్రత్యేకమైన విధాలను సంబోధించునట్లు వ్యక్తపరచారు. మరలా, ఈ విషయమును మరింతగా వక్కాణించకుండా మనము జాగ్రత్తపడాలి. క్రొత్త నిబంధన రచయితలు కూడా కొన్ని



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

శాశ్వతమైన నైరూప్యమైన సత్యాలను గూర్చి మాట్లాడారు. కాని చాలా వరకు వారి రచనలు వారి దినములో వివిధములైన విశ్వాసులు ఎదుర్కొన్న ప్రత్యేక సవాళ్ళను గూర్చి సంబోధించేవిగానే ఉన్నాయి.

ఉదాహరణకు, పౌలు రాసిన పత్రికలు ఒకదానితోనొకటి ఎందు నిమిత్తము అంతగా వ్యత్యాసముగా ఉన్నాయో, ఈ సేవకునికి సంబంధించిన దృక్పథం స్పష్టపరుస్తుంది. ఒక క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమును రాయాలని పౌలు అనుకొని ఉంటే ఆయన కేవలం ఒక పత్రిక మాత్రమే రాసి ఉండేవాడు. కాని తన పత్రికలలోని విషయము మరియు ఉద్ఘాటన నాటకీయంగా భిన్నంగా ఎందుకు ఉన్నదంటే, ప్రతి పత్రిక కూడా వివిధ సంఘములలోని వివిధ అవసరాలను గూర్చి మాట్లాడుతున్నది.

నిస్సందేహంగా, క్రొత్తనిబంధనలోని రచయితలందరూ కూడా వేదాంతశాస్త్రమును గూర్చిన లోతైన అధ్యయనము కలిగినవారే. కాని క్రొత్తనిబంధనలోని రచనలలో వారి వేదాంతశాస్త్రములను వ్యక్తపరచవలసి వచ్చినప్పుడు, ఈ విధమైన ఉన్నతమైన భావాలను వివరించాలని వారు అనుకొనలేదు. దీనికి బదులు, వేదాంతశాస్త్రమును వాస్తవికమైన జీవిత పరిస్థితులకు అన్వయించడము ద్వారా ప్రజలకు సేవచేయడమే వారి లక్ష్యమైయుండినది. కాబట్టి, సిద్ధాంతములను హేతుబద్ధముగా వివరించడం కంటే, క్రొత్తనిబంధనలోని రచయితలు ప్రజల యొక్క వాస్తవికమైన, ప్రయోగాత్మకమైన అవసరతలపైన, మరియు ఆ అవసరతలను వేదాంతశాస్త్రము తీర్చగల మార్గాలపై తమ దృష్టిని నిలిపారు. మరియు ఫలితముగా, వారి వేదాంతపరమైన రచనలు ప్రామాణికమైన క్రమబద్ధ వేదాంతముతో పోల్చితే చాలా భిన్నముగా ఉన్నాయి.

మూడవ స్థానములో, క్రొత్తనిబంధన దాని వేదాంతశాస్త్రమును విభిన్నమైన కళాప్రక్రియలలో వ్యక్తపరుస్తుంది గనుక క్రొత్తనిబంధన వేదాంతశాస్త్రము క్రమబద్ధ శాస్త్రము కంటే భిన్నముగా ఉన్నది. క్రొత్తనిబంధనలోని రచయితలు అనేకానేకమైన సాహిత్య రూపములను మరియు శైలులను ప్రయోగించారు.

### కళా ప్రక్రియలు

క్రమబద్ధ వేదాంతశాస్త్రము ఒకే సాధారణ కళాప్రక్రియతో రాయబడింది: దీనినే మనము ఒక సుదీర్ఘమైన వ్యాసము లేదా గ్రంథముగా చెప్పవచ్చు. క్రమబద్ధ వేదాంతశాస్త్రములో కనిపించే ప్రతిఒక్కటి కూడా ఈ విధమైన ఒక గద్యభాగముగా కనిపిస్తుంది.

దీనికి విరుద్ధముగా, క్రొత్త నిబంధనలోని వేదాంతము మాత్రము వివిధమైన కళాప్రక్రియలలో వ్యక్తపరచబడింది. క్రొత్తనిబంధనలో అనేక విధములైన సాహిత్య రకాలు కనిపిస్తాయి. విశాలంగా మాట్లాడితే, దానిలో రెండు సాధారణమైన సాహిత్యములు ఉన్నాయి: కథనము మరియు పత్రిక. సువార్తలు మరియు అపొస్తలుల కార్యములు ప్రధానంగా కథనము రూపములో ఉండగా, క్రొత్తనిబంధనలోని మిగిలినదంతయు పత్రికలు లేదా లేఖలుగా చెప్పవచ్చు. మరియు క్రొత్తనిబంధనలోని కథనములు మరియు పత్రికలలోనే, మనకు కీర్తనలు, ప్రార్థనలు, ఆజ్ఞలు, నిందారోపణలు, వ్యక్తిగత విన్నపాలు, దర్శనములు, హెచ్చరికలు మరియు అనేక విధములైన ఇతర సాహిత్య రకాలు కూడా ఉన్నాయి. అయినప్పటికీ, క్రమబద్ధ వేదాంతశాస్త్రములో ఈ కళాప్రక్రియలు చాలా అరుదుగా కనిపిస్తాయి.

వాటి వాటి సామాన్య వేదాంత అమరికలు మరియు నిర్మాణాలను పోల్చి చూస్తే, అనగా, సిద్ధాంతాలను ఒకదానితో ఒకటి కలుపుతూ వారు వేదాంతశాస్త్రాన్ని అమర్చే విధానాన్ని చూస్తే, క్రొత్తనిబంధన వేదాంతశాస్త్రానికిని క్రమబద్ధ వేదాంతశాస్త్రానికినిగల వ్యత్యాసాలు కూడా కనబడుతున్నాయి.

## సామాన్య అమరిక

క్రమబద్ధ వేదాంతశాస్త్రము సాధారణముగా శతాబ్దాలుగా సంఘ చరిత్రలో అభివృద్ధిచేయబడిన ఒక ప్రాథమిక ఆకృతికి అనుసరిస్తుంది. మనము చూచిన రీతిగానే, దాదాపు ప్రొటెస్టెంట్ క్రమబద్ధ వేదాంతశాస్త్రములన్నియు ఇదే ఆకృతిని అనుసరిస్తున్నాయి: లేఖన సిద్ధాంతము, లేదా దేవునిని గూర్చిన సిద్ధాంతము వీటికి ముందు వస్తుంది — మానవశాస్త్రము, రక్షణశాస్త్రము, సంఘశాస్త్రము మరియు రాకడశాస్త్రము.

ఇప్పుడు, క్రొత్త నిబంధనను గూర్చి బాగుగా తెలిసినవారికి, క్రొత్త నిబంధన రచయితలు ఈ అంశములన్నిటిని పరిగణలోకి తీసుకున్నారను విషయము తేటగా కనుపరచబడాలి. క్రొత్త నిబంధన గ్రంథము లేఖనము, దేవుడు, మానవాళి, రక్షణ, సంఘము మరియు చివరి దినములను బోధిస్తుంది. కాని అదే సమయములో, క్రమబద్ధ వేదాంతశాస్త్రమువలె, క్రొత్త నిబంధన ఈ క్రమములో నిర్వహించబడలేదు లేదా నిర్మాణాత్మకమైనది కూడా కాదని గుర్తించడం చాలా ప్రాముఖ్యం. బదులుగా, మొదటి శాతాబ్దమునకు చెందిన చాలామంది యూదా వేదాంత పండితుల వలె, క్రొత్త నిబంధన రచయితలు తమ వేదాంతశాస్త్రమును ఎక్కువగా మెస్సీయ దేవుని రాజ్యము యొక్క నేపథ్యముతో నిర్దేశించారు.

క్రీస్తుకు కొన్ని శాతాబ్దముల క్రితం, దేవుడు పాపభరితమైన ఇశ్రాయేలు రాజ్యమును సుదీర్ఘ కాలము చెరలోకి పంపిస్తాడని మరియు అన్యుల దౌర్జన్యమునకు అప్పగిస్తాడని పాత నిబంధన ప్రవక్తలు బయలుపరచెను. కడవరి దినములలో దేవుడు ఇశ్రాయేలీయుల చెరకు ముగింపు నిచ్చి జయము మరియు ఆశీర్వాదముతో కూడిన నూతన దినమును ఇస్తాడని కూడా ప్రవక్తలు ప్రకటించారు. దేవుని రాజ్యము యొక్క చివరి స్థాయిని భూమిమీద నిర్మించి, దేవుని శత్రువులకు తుది తీర్పును మరియు నమ్మకస్తులైన యూదులకు మరియు అన్యులకు ఆశీర్వాదములనిచ్చు మెస్సీయ ద్వారా ఆయన దీనిని నెరవేర్చును. క్రొత్త నిబంధన కాలానికి, యూదులు తరాల తరబడి చెర యొక్క కష్టములను అనుభవించారు, మరియు దాని ఫలితముగా, మెస్సీయ రాక, మరియు ఆయనతో పాటు, దేవుని రాజ్య చివరి దశ, కేంద్రమైన అంశము కాకపోయినా కేంద్రమైన అంశములలో ఒకటిగా ఉంది, యూదుల వేదాంతశాస్త్రమును సమగ్రపరచింది. యూదులైన వేదాంతపండితులు ఎక్కువగా ఇటువంటి ప్రశ్నలతో నిండిపోయియున్నారు: “మెస్సీయ ఎప్పుడు వస్తాడు?” “తీర్పు మరియు ఆశీర్వాదముల మహా గొప్ప దినమును మెస్సీయ ఎలా తీసుకొస్తాడు?” మరియు, “మెస్సీయ వస్తాడను ఆశతో దేవునికి నమ్మకస్తులైన ప్రజలు ఎలా నివసిస్తున్నారు?”

ఈ అంశములు కూడా క్రొత్త నిబంధన రచయితలకు కేంద్రమైన అంశములుగా ఉన్నాయి. క్రొత్త నిబంధన రచయితలు తమ వేదాంతశాస్త్రమును దేవుని రాజ్యము యొక్క చివరి దశ మరియు మెస్సీయ అనే అంశముల చుట్టూ నిర్మించారు. అయితే వారు దీనిని ప్రత్యేకమైన క్రైస్తవ విధానములో చేశారు.

చెర యొక్క ముగింపు మరియు దేవుని మెస్సీయ రాజ్యము యొక్క రాక యూదులైన వేదాంతపండితులు ఆశించిన రీతిలో సులభంగా, తిన్నగా జరుగదని యేసు మరియు అపొస్తలులు వివరించారు. చెర మరియు పాపము అను ఈ యుగము నుండి దేవుని మెస్సీయ రాజ్యమను యుగములోకి మారు పద్ధతిలో సంక్లిష్ట మరియు పొడిగించబడిన విధానమును వివరించడం క్రొత్త నిబంధన రచయితల ప్రాథమిక లక్ష్యాలలో ఒకటి. క్రొత్త నిబంధన ప్రకారము, చెర ముగింపును మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మెస్సీయ రాజ్యము యొక్క ఆరంభమును యేసు భూలోకములో ఉన్నప్పుడే ప్రారంభించాడు. ఒక దినమున క్రీస్తు తిరిగివస్తాడు మరియు రాజ్యమును తుది తీర్పు మరియు ఆశీర్వాదము యొక్క మహిమాన్వితమైన సంపూర్ణతకు తీసుకువస్తాడు. అయితే ఈ మధ్యకాలములో, చెర యుగము మరియు మెస్సీయ రాజ్యపు యుగము ప్రక్కప్రక్కనే ఉంటాయి.

క్రొత్త నిబంధన రచయితలు వారు నమ్మిన ప్రతిదానిని ఈ సామాన్య అమరిక ప్రకారము నిర్మించారు. ఉదాహరణకు, వారు దేవునిని గూర్చి పరధ్యానములులో వివరించలేదు, పాప యుగములో దేవుడు ఎలా వ్యవహరించాడు, కలగలిసియున్న యుగములలో ఏ విధముగా వ్యవహరించుచున్నాడు మరియు రానున్న యుగములో ఏ విధముగా వ్యవహరించబోతున్నాడు అను విషయములను వివరించుటపై ప్రధానమైన ఆసక్తి కలిగియుండేవారు. క్రీస్తు సిద్ధాంతమును గూర్చి సిద్ధాంతపరమైన చర్చలను వారు అందించలేదు. బదులుగా, రాజ్య ఆరంభము, కొనసాగింపు మరియు అంతిమ కాలమునకు సంబంధించి ఆయన ఎవరో వివరించారు.

పరిశుద్ధాత్ముడు కూడా ఈ మూడు దశల్లో ఈ విధముగా వివరించబడ్డాడు "రానున్నవాడు," "సంఘమును ప్రస్తుతము బలపరచువాడు," మరియు "ఒక దినమున అందరిని నింపువాడు." రక్షణ సిద్ధాంతము కూడా ఈ అంశపరమైన పద్ధతి ఆకృతిలోనే నిర్మించబడింది. రక్షణ ముందుగానే నెరవేర్చబడినదిగా ఉంది, కాని కొనసాగించబడుచున్న రాజ్యములో నెరవేర్చబడుచూ ఉన్నది మరియు క్రీస్తు మహిమలో తిరిగివచ్చునప్పుడు కూడా అది పరిపూర్ణముగా నెరవేర్చబడుతుంది. ఈ విధముగా, క్రొత్త నిబంధన యొక్క సామాన్య అమరిక క్రమబద్ధ వేదాంతశాస్త్ర సామాన్య అమరికకు భిన్నంగా ఉన్నది.

కాబట్టి క్రమబద్ధ వేదాంతశాస్త్రము మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము మధ్య పోలికను చూచినప్పుడు అది సారుప్యతలను మరియు వ్యత్యాసములను ప్రత్యక్షపరుస్తుంది. క్రమబద్ధ వేదాంతశాస్త్రము లేఖన ఆధారితమైనది; దాని యొక్క వాదనలు లేదా వేదాంతపరమైన వాదనలు బైబిలు ప్రకారముగా సత్యమైనవిగా ఉండాలి, మరియు అవి అదే సిద్ధాంతములను మరియు వాస్తవములను ధృవీకరించాలి. ఈ విధముగా, రెండు ఒకే విధముగా ఉన్నాయి. కాని అదే సమయములో, క్రమబద్ధ వేదాంతశాస్త్రము మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమునకు మధ్య ప్రాముఖ్యమైన వ్యత్యాసములు కూడా ఉన్నాయి.

ఇప్పటి వరకు మనము క్రమబద్ధ వేదాంతశాస్త్రము మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమునకు మధ్య సంబంధమును చూశాము, మరియు ఇప్పుడు రెండవ అంశమును చర్చించడానికి మనము సిద్ధముగా ఉన్నాము: క్రైస్తవ సంఘ చరిత్రలో క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క అభివృద్ధి.

## చారిత్రక అభివృద్ధులు

మనము చూచినట్లుగా, క్రమబద్ధ వేదాంతశాస్త్రము చాలా ముఖ్యమైన విధానాల్లో క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమునకు భిన్నంగా ఉన్నది. అయితే, ఈ వ్యత్యాసములు కొన్ని తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతాయి: "లేఖనములకు కట్టుబడి ఉన్న ప్రొటెస్టెంట్లు, క్రొత్త నిబంధనకు చాలా భిన్నంగా ఉన్నటువంటి వేదాంతశాస్త్ర వ్యవస్థను ఎందుకు ఆమోదించారు?" "నమ్మకస్తులైన క్రైస్తవులు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వేదాంతశాస్త్రమును నిర్మించుటకు అత్యంత గౌరవప్రదమైన విధముగా క్రమబద్ధ వేదాంతశాస్త్రము ఎలా మారింది?"

ఈ విధముగా ఈ విషయమును మనము క్రోడీకరించవచ్చు. మారుచున్న ప్రపంచమునకు సంఘము ప్రతిస్పందించు లేదా సేవలను అందించు సుదీర్ఘ ప్రక్రియ ద్వారా క్రమబద్ధ వేదాంతశాస్త్రము వెలువడింది. క్రైస్తవ మతము యెరూషలేము నుండి ప్రపంచములోని ఇతర ప్రాంతములకు వ్యాపించినప్పుడు, క్రైస్తవ వేదాంతపండితులు వివిధ మార్పులకు మరియు సవాళ్లకు స్పందించవలసి వచ్చింది. బైబిలు బోధనలను వివరించుటకు మరియు అనువర్తించడానికి క్రొత్త మార్గములను కనుగొనడము ద్వారా వారు దీనిని కొంత వరకు చేసారు. చివరకు, వారు నియమించిన వ్యూహాలు క్రమబద్ధ వేదాంతశాస్త్రముగా అభివృద్ధి చెందాయి.

మొదటిగా, అనేకమంది క్రైస్తవులు సాంస్కృతిక మార్పులకు ప్రతిస్పందనగా వేదాంతశాస్త్రమును రూపొందించే ఆలోచనతో పునర్నిర్మాణం చేసారు. అయితే క్రొత్త నిబంధన స్పష్టపరచేదేమనగా లేఖనములో ప్రత్యక్షపరచబడిన సత్యమునకు కట్టుబడి, ఇతరులు అర్థము చేసుకొను విధముగా ఆ సత్యమును మాట్లాడడం అనేది క్రీస్తు అనుచరులుగా మన బాధ్యతయై ఉన్నది. వాస్తవానికి, ఈ విధముగా చేయుమని గొప్ప ఆజ్ఞలో క్రీస్తు తానే మనకు బోధించాడు. మత్తయి 28:19-20లో ఆయన మాటలను ఆలకించండి:

> కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులనుగా చేయుడి; తండ్రియొక్కయు కుమారునియొక్కయు పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి వారికి బాప్తిస్మ మిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను ఆజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి బోధించుడి.

ఇక్కడ ఒక విషయమును గమనించండి: "కాబట్టి మీరు వెళ్లి సమస్త జనులకు బైబిలు చదివి వినిపించండి" అని యేసు చెప్పలేదు. సంఘ పరిచర్యలో లేఖనమును బహిరంగముగా చదవడమనేది ప్రాముఖ్యమైన భాగము, అయితే గొప్ప ఆజ్ఞలో యేసు మనలను ఆజ్ఞాపించింది ఇది కాదు. ఆయన ఆజ్ఞను నెరవేర్చాలంటే, లేఖనములను *బోధించడానికి* మనము ఆయన వాక్కును "బోధించాలి."

మరో మాటలో, లేఖన సత్యమును మాట్లాడడానికి క్రొత్త మార్గములను మనము వెదకాలి, మరియు మన చుట్టూనున్న ఇతరులు అర్థము చేసుకొనేలా బైబిల్లో మనము కనుగొనినదానిని వివరించడమును మరియు ఒక ఆకృతిని తీసుకురావడమును అది కలిగియుంటుంది. బోధించాలి, ప్రభావవంతంగా మాట్లాడాలి, మరియు గొప్ప ఆజ్ఞను నెరవేర్చాలనిన కోరిక వలననే క్రమబద్ధ వేదాంతశాస్త్రము వెలుగులోకి వచ్చింది మరియు నేడు కొనసాగుచున్నది.

నేడు మనకు తెలిసిన దాని ప్రకారము క్రమబద్ధ వేదాంతశాస్త్రముకు దారి తీసిన మూడు ప్రధాన చారిత్రక పరిమాణములను క్లుప్తముగా వివరించుదము: మొదటిగా, సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము, సుమారు క్రీ.శ. 150 నుండి క్రీ.శ. 600 వరకు కొనసాగింది, మరియు ఇది క్రమబద్ధ వేదాంతశాస్త్రము వైపు దృష్టి పెట్టడం ప్రారంభించింది; రెండవదిగా, మధ్యయుగ వేదాంతశాస్త్రము, ఇది సుమారు క్రీ.శ. 600 నుండి 1500 వరకు కొనసాగింది, వేదాంతశాస్త్రము యొక్క విధానములు అభివృద్ధి చెందినప్పుడు అవి క్రమబద్ధతలకు తక్షణ పూర్వగాములుగా ఉన్నాయి. మూడవదిగా, ప్రొటెస్టెంట్



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వేదాంతశాస్త్రము, ప్రొటెస్టెంట్లు క్రీ.శ. 1500 నుండి నేటి వరకు క్రమబద్ధ వేదాంతశాస్త్రమును నిర్మించిన విధానములు. క్రీస్తు మరియు ఆయన అపొస్తలుల కాలము తరువాత సంఘ పితరుల కాలములో క్రమబద్ధతల పట్ల జరిగిన కొన్ని మొట్టమొదటి ఉద్యమాలతో ఆరంభించుదము.

## సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము

క్రమబద్ధతల వైపుకు ఈ మొదటి ప్రధాన మెట్టును అర్థము చేసుకోవడానికి, రెండు అంశములను అన్వేషించుదము: మొదటిగా, సంఘ పితరుల కాలములో సంఘము అనుభవించిన సాంస్కృతిక మార్పులు; మరియు రెండవదిగా, సంస్కృతిలో కలిగిన ఈ మార్పుల ఫలితముగా వచ్చిన వేదాంతశాస్త్ర మార్పులు. సంఘ పితరుల కాలములో చోటుచేసుకొనిన సాంస్కృతిక మార్పులను మొదటిగా అన్వేషించుదము.

### సాంస్కృతిక మార్పులు

అపొస్తలుల కాలము తరువాత ఆది సంఘము అనుభవించిన గొప్ప మార్పులలో ఒకటి ఏమనగా క్రైస్తవ్యము యొక్క కేంద్రమును పాలస్తీన దేశము నుండి క్రొత్త గృహమైన అన్య ప్రపంచము వైపు త్రిప్పుట అనే ఉద్యమము. ఈ మార్పు చాలా నిర్ణయాత్మకమైనది గనుక యూదులు కాకుండా అన్యులే (యూదులు కానివారు) సంఘములో ప్రముఖ వేదాంతపండితులయ్యారు.

నాయకత్వములోని ఈ పరివర్తన క్రైస్తవులు వేదాంతశాస్త్రమును నిర్మించిన మార్గములలో చాలా ముఖ్యమైన మార్పులకు దారితీసింది. అన్య వేదాంతపండితులు సువార్తను తమ అన్యప్రపంచమునకు అందించడానికి ప్రయత్నించారు, వారు ఆ సమయములోనున్న గ్రీకో-రోమన్ సంస్కృతికి సంబంధించిన మార్గాల్లో తమ విశ్వాసమును వివరించడం మరియు కాపాడుకోవడం ప్రారంభించారు. వారు తమ కాలములోని గ్రీకుల తత్వాల ప్రకారము క్రైస్తవ్యమును వర్ణించడం ప్రారంభించారు.

ఆసక్తికరముగా, గ్రీకు సంస్కృతితో లేఖనమును అర్థవంతమైన సంభాషణలోకి తీసుకువచ్చిన మొదటివారు క్రైస్తవులు కాదు. క్రీస్తుకు కొన్ని శాతాబ్దాల క్రితం, అనేకమంది యూదులు అన్యప్రపంచమంతటా చెల్లాచెదురయ్యారు. వారు తమ పాత నిబంధన విశ్వాసమును ఆ ప్రపంచములో జీవించినప్పుడు, యూదులైన మిషనరీలు లేదా యూదా మత ప్రచారకులు యూదా మతము మరియు అన్యప్రపంచము మధ్య దూరమును తొలగించుటకు ప్రయత్నించారు.

ఈ యూదులు అన్యులకు ప్రచారము చేయుట ద్వారా, వారి తరువాత క్రైస్తవులు అనుసరించిన రెండు మార్గములను వారు స్థాపించారు. ఒక వైపున, అనేకమంది యూదులు తమ విశ్వాసమును గ్రీకు సంస్కృతికి అనుగుణంగా మార్చారు గనుక వారు మిళితవాదులుగా మారారు. సత్యమైన పాత నిబంధన విశ్వాసమును అన్య నమ్మకములతో మరియు ఆచారములతో సరికాని విధముగా కలిపేశారు. అలాటి సమన్వయవాదము యొక్క ఉత్తమమైన ఉదాహరణలలో ఒకటి, క్రీ.పూ. 30 నుండి క్రీ.శ. 50 వరకు నివసించినటువంటి అలెగ్జాండ్రియాలోని ఫిలో యొక్క రచనలలో కనిపిస్తుంది. పాత గ్రీకు తత్వశాస్త్రముతో శ్రావ్యంగా ఉన్నందున అతని యూదా విశ్వాసము గౌరవప్రదమైనదని వాదించుట ద్వారా మరియు మోషే పుస్తకాలను అలంకార రూపకములుగా చూచుట ద్వారా అన్యుల మేధో సంస్కృతికి మరియు పాత నిబంధన విశ్వాసమునకు మధ్య తేడాలను తగ్గించడానికి ఫిలో ప్రయత్నించాడు.

అయితే, అదే సమయములో, అనేకమంది యూదులు ఈ శతాబ్దములలో తమ బైబిలానుసారమైన విశ్వాస విషయములో రాజీపడకుండా తమ గ్రీకు సంస్కృతులతో చట్టబద్ధముగా పనిచేయడానికి మార్గములను కనుగొన్నారు. ఈ విధమైన పరిచర్యను గూర్చిన ఒక గొప్ప ఉదాహరణ ఏమనగా గ్రీకు పాత నిబంధన గ్రంథమైన సెప్టుజెంట్ ఆవిర్భవము. పాత నిబంధన యొక్క గ్రీకు సంస్కరణలు మధ్యధరా ప్రపంచమంతటా సమాజమందిరాలలో అనువదించబడ్డాయి గనుక హెబ్రీ భాషను అర్థము చేసుకొనలేని యూదులు మరియు అన్యులకు లేఖనములు అందుబాటులోకి వచ్చాయి.

సంఘు పితరుల కాలములో క్రైస్తవ వేదాంతపండితులు ఈ రెండు దిశలలో కూడా వెళ్లారు. ఒక ప్రక్క, క్రొత్త నిబంధన విశ్వాసమును గ్రేకీకరణ చేయడానికి అనేక ప్రయత్నాలు చేసారు కాబట్టి చాలామంది సంఘ నాయకులు క్రైస్తవ సమన్వయవాదములో పడిపోయారు. వారు నిజమైన క్రైస్తవ్యమును అన్య నమ్మకాలు మరియు ఆచారాలతో మిళితము చేసారు. సమన్వయవాదము యొక్క కొన్ని రూపములు క్రొత్త నిబంధన సంఘములో అప్పటికే ఉన్నాయి, కానీ సంఘు పితరుల కాలములో ప్రసిద్ధిగాంచిన అనేక వైదీకముగాలేని విభాగాలు అనగా యెబియోనిజం, బాసిలిడిసం, మరియు జ్ఞాస్తికవాదము క్రైస్తవ్యములో అభివృద్ధి చెందాయి. మరో ప్రక్క, సాంప్రదాయ క్రైస్తవ వేదాంతపండితులు సమన్వయవాదమును తిరస్కరించినప్పటికీ తమ చుట్టూనున్న గ్రీకు ప్రపంచ దృక్పథాలతో సంభాషించడం ద్వారా అన్యమత ప్రపంచములో పరిచర్య చేయడానికి చట్టబద్ధమైన మార్గాలను కనుగొన్నారు. ఈ నిజమైన విశ్వాసులు సమస్త జనులకు క్రీస్తు ఆజ్ఞను అందించడానికి పూనుకొనినప్పుడు, బైబిలానుసారమైన సత్యముతో రాజీపడకుండ సమకాలీన తాత్వికతతో మరియు మతపరమైన దృక్పథాలతో తమ వేదాంతశాస్త్రమును వ్యక్తపరచారు.

ఈ సాంస్కృతిక మార్పులను గ్రహించి, సంఘు పితరుల కాలపు అన్యప్రపంచములో పరిచర్య సవాళ్లను ఎదుర్కొనేందుకు ప్రామాణిక క్రైస్తవ వేదాంతశాస్త్రము మార్పుచెందుటకు ఉపయోగించిన కొన్ని మార్గములను పరిశీలించుదాము. క్రైస్తవ వేదాంతశాస్త్రములోని ఈ దశలో ఉద్భవించిన సాధారణ వేదాంత ధోరణులు ఏవి?

## వేదాంతశాస్త్ర మార్పులు

సంఘు పితరుల కాలములో, నవీన ప్లాటో వాదముగా పిలువబడిన ఒక దృక్పథం మధ్యధరా ప్రపంచములో ప్రధాన తాత్విక మరియు మతపరమైన శాఖగా ఉన్నది. "నవీన ప్లాటో వాదము" అను పదము అనేక రకాలైన దృక్పథములను కలిగియుండి, విస్తృత మతపరమైన తత్వాన్ని సూచిస్తుంది. అది నవీన ప్లాటో వాదముగా ఎందుకు పిలువబడుతుందంటే అది ప్లాటో బోధనలనలపై ఆధారితమైనది, కానీ క్రీ.శ 203 నుండి 279 వరకు నివసించిన ప్లోటినస్ వంటి తత్త్వవేత్తల ద్వారా పరిచయము చేయబడిన నూతన ఆలోచనలను కూడా కలిగియుంది.

ఈ మతపరమైన తత్వశాస్త్రము సంక్లిష్టంగా ఉన్నప్పటికీ, మూడు విషయాలలో దాని కేంద్ర అంశాలను సంగ్రహించవచ్చు: ద్వంద్వాదం (డ్యూయలిజం), హేతువాదం (రేషనలిజం), మరియు మార్మిక సిద్ధాంతం (మిష్టిసిజం).

మొదటిగా, నవీన ప్లాటో వాదము అనేది ద్వంద్వాదం. ఇది ఆత్మీయ మరియు భౌతిక విషయాలకు మధ్య ఒక ప్రాథమిక భేధమును బోధించింది. నవీన ప్లాటో ద్వంద్వాదంలో స్వచ్ఛమైన ఆత్మ మంచిదిగా మరియు స్వచ్ఛమైన పదార్థం పరిపూర్ణ చెడుగా భావించబడింది. దేవుడు ఆత్మీయ మరియు



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

భౌతిక మండలమను రెండిండికి పైగా ఉన్నప్పటికీ, ఆయన మంచితనములో దేవుడు తన దైవిక మేధస్సును, వెలుగును లేదా వాక్యమును ఆత్మీయ మరియు భౌతిక ప్రపంచములలో వ్యాప్తి చేసాడు. ఈ దైవికమైన శక్తి దేవుని నుండి వెలువడి వాస్తవికత అంతటిలో ప్రవహించి, క్రమము మరియు రూపమును తెచ్చి, మొదట ఆత్మీయ మండలముతో ఆరంభమై భౌతిక ప్రపంచము వైపు క్రిందికి కదిలింది.

ఈ ద్వంద్వాద దృక్పథము మానవ జీవన విధానముపై కొన్ని ప్రభావాలను కలిగియుండినది. ప్రజలు భౌతిక ప్రపంచములో జన్మించినవారిగా చెప్పబడ్డారు, భౌతిక ప్రపంచములో ఖైదీలుగా కూడా చెప్పబడ్డారు. అయితే భౌతిక ప్రపంచముతో ఉన్న అన్ని సంబంధములను ఉపక్రమించుకొని దేవునిని వెదకడమే మానవ జీవితములో అత్యంత ఉత్తమమైన విషయం అని నవీన ప్లాటో వాదము బోధించింది.

దేవునిని వెదకు ప్రయత్నములో భౌతిక ప్రపంచముతో సంబంధములను ఉపక్రమించుకొను ఈ భావన నవీన ప్లాటో వాదము యొక్క రెండవ ప్రాధాన్య విషయమైన హేతుబద్ధతకు మనలను నడిపిస్తుంది.

భౌతిక ప్రపంచమనే బంధకములో ఉన్న తమ స్థితిని అధిగమించాలని ప్రజలు ఆశించినప్పుడు, మనందరిలో ఉన్న ఆత్మీయ మరియు మేధో సామర్థ్యమును మానవ తర్కము మీద దృష్టి పెట్టుటతో ఆరంభించవలసియున్నది. జాగ్రత్తగా తర్కించుట మరియు ఆలోచించుట ద్వారా, ప్రజలు తమను బంధించిన దుష్ట పదార్థమును దాటి గొప్ప ప్రగతిని సాధించే అవకాశం ఉంటుంది.

హేతుబద్ధమైన సమీక్ష ఎంతటి ప్రాముఖ్యమైనదైనప్పటికినీ, నిజముగా గుణవంతుడైన వ్యక్తికి అది ఆరంభము మాత్రమే. మానవ తర్కమును అధిగమించి మర్మమైన మనుగడలోకి వెళ్లునట్లు నవీన ప్లాటో వాదము ప్రజలకు పిలుపునిచ్చింది. పదార్థము లేక లోకము నుండి పూర్తిగా వేరుపరచబడి, దేవునితో పరిపూర్ణముగా ఐక్యమవ్వాలంటే, ప్రజలు తమ సొంత మేధాశక్తులను దాటి దేవుని సొంత ఉన్నతమైన స్థానమునకు చేరుకోవాలి.

ఏలయనగా, దేవుడు అన్నింటిని మించినవాడు, మానవ మేధస్సుకు అందనివాడు, మరియు మానవులు మానవ ఆలోచనను దాటి మర్మమైన ప్రత్యక్షతను పొందుకుంటేనే దేవునితో ఏకమౌతారు అనేది నవీన ప్లాటో వాదము యొక్క నమ్మకమైయున్నది. ఈ ఆత్మీయ పారవశ్యం అనేది సృష్టియంతటిలో ఉత్పన్నమయ్యే దైవిక వెలుగు మరియు వాక్య ప్రేరణ ద్వారా వస్తుంది. మరియు అది దేవునితో సర్వోత్తమ ఐక్యత, అమితానందం, మానవ విధి యొక్క గొప్ప నెరవేర్పునకు నడిపించగలదని చెప్పబడింది.

ఈ తాత్విక మరియు మతపరమైన అంశములు సంఘ పితరుల కాలములో మధ్యధరా ప్రపంచమంతటా విస్తృతంగా ఉండేవి గనుక నమ్మకమైన వేదాంతపండితులు వాటితో పరస్పర సంబంధమును నివారించలేకపోయారు. వాస్తవానికి, వారి యొక్క అనేక వేదాంత చర్చలు నవీన ప్లాటో వాదము నమ్మకములకు అనుగుణంగా అమరిక చేయబడ్డాయి.

ఈ ప్రయత్నాలు చాలావరకు చట్టబద్ధమైనవి. ఉదాహరణకు, కాన్స్టాంటినోపుల్ మరియు చాల్సిడన్ వంటి ఆది సంఘము యొక్క గొప్ప క్రైస్తవ సభలు, నవీన ప్లాటో వాదము యొక్క దృక్పథాలలో బైబిలానుసారమైన నమ్మకాలను వ్యక్తం చేసాయి. అలెగ్జాండ్రియకు చెందిన క్లెమెంతు, ఒరిగెన్, మరియు అగస్టిన్ వంటి ప్రముఖ క్రైస్తవ వేదాంతపండితులు నవీన ప్లాటో వాదము యొక్క దృక్పథాలలో తమనుతాము వ్యక్తం చేసుకున్నారు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

సంఘ పితరుల కాలములోని నమ్మకమైన క్రైస్తవ వేదాంతపండితులు నిజమైన సువార్త యెడల వారి ప్రాథమిక కట్టుబాట్లకు ఆధారంగా ఉండుటకు నవీన ప్లాటో వాదముపై తమ దృష్టిని పెట్టలేదు. వారు బైబిలు సత్యాన్ని గట్టిగా పట్టుకొనియుండేవారు. కానీ నవీన ప్లాటో వాదము యెడల ఒక అవగాహన కలిగియున్నందున, వారు మరియు వారి సమకాలీనులు అర్థము చేసుకొనగలిగే మార్గాలలో లేఖనాలను వివరించుటకు అది సహాయపడింది. ఈ విధముగా వారి సంస్కృతులతో సంభాషించుట ద్వారా, వారు సువార్తను ప్రకటించగలిగారు, సంఘమును స్థాపించారు, క్రీస్తు ద్వారా రక్షించబడు జ్ఞానములోకి అనేకమంది అవిశ్వాసులను నడిపించారు.

సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రముపై నవీన ప్లాటో వాదపు ప్రభావమును సంకుచితముగా చెప్పడానికి చాలా మార్గాలు ఉన్నాయి. కానీ మన ఉద్దేశముల కొరకు, నవీన ప్లాటో వాదము సారంశమునకు సమాంతరముగా నున్న సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము యొక్క మూడు లక్షణములను చూపుదాము: సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము యొక్క ఆత్మీయ ప్రాధాన్యత, తర్కము యొక్క ప్రాముఖ్యత, మరియు మార్మిక సిద్ధాంతము యొక్క ప్రాముఖ్యత. నవీన ప్లాటో వాదము ద్వారా ప్రభావితం చేయబడినందున, మొదటిగా సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము యొక్క ప్రాధాన్యతలను పరిశీలించుదము.

ప్రాధాన్యతలు. నవీన ప్లాటో వాదము యొక్క లక్షణాలలో ఒకటి ఆత్మీయ మరియు భౌతిక మండలాల మధ్య ద్వంద్వాదం అని మీరు గుర్తుచేసుకుంటారు. ఈ ద్వంద్వాదమునకు సంఘ పితరుల కాలపు వేదాంతము స్పందించే క్రమములు ఐహిక సంబంధమైన విషయములు కాక ఆత్మ సంబంధమైన విషయములకు ప్రాధాన్యతనిచ్చు విధముగా బైబిలు గ్రంథ బోధలను నిర్వహిస్తూ సమర్పిస్తూ స్పందించింది, వేదాంతము పట్ల గల ఈ దృక్పథమును "పై నుండి వచ్చిన వేదాంతము" అని పిలుస్తాము. లౌకిక విషయాలకు కాకుండా ఆత్మీయ విషయాలకు ప్రాముఖ్యతనిచ్చు విధముగా బైబిలు బోధలను ఏర్పాటు చేసి అందించుట ద్వారా సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము ఈ ద్వంద్వాదమునకు స్పందించింది, ఇది వేదాంతశాస్త్రములో "పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము" అని మనము పిలచే ఒక విధానము. ఒక మాటలో, పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము భూసంబంధమైన, మరింత లౌకికమైన విషయాలకంటే ఆత్మీయ విషయాలకు మొదటి స్థానమునిస్తుంది — దేవుడు మరియు ఆయన మార్గములపై దృష్టిపెడుతుంది: "దేవుని సారము ఏమిటి?" "ఆయన లక్షణాలు ఏమిటి?" "దేవుని ఐక్యత ఏమిటి?" "త్రిత్వము అనగా ఏమిటి?" భౌతిక ప్రపంచములో మానవుని జీవితము మరియు మానవ పరిస్థితిని గూర్చిన విషయాలకంటే సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రములో ఈ విషయాలు మరింత ప్రాముఖ్యమైనవిగా ఉండేవి. ఈ ప్రాధాన్యతలు సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము యొక్క ముఖ్య లక్షణములయ్యాయి.

రెండవ స్థానములో, వేదాంతపండితులు వేదాంతశాస్త్రములో తర్కము యొక్క ప్రాముఖ్యతను గొప్పగా మెచ్చుకొని, వేదాంతశాస్త్రములో తార్కిక ప్రతిబింబము ప్రాథమిక సాధనంగా దానిపై దృష్టి పెట్టారు.

తార్కికము. మనము చూచినట్లుగా, భౌతిక ప్రపంచమును అధిగమించి పైకి లేవగల మానవ తర్కాన్ని అమలుచేసే బాధ్యత మానవులకు ఉందనే నమ్మకము నవీన ప్లాటో వాదము యొక్క ముఖ్య విలువలలో ఒకటి. మేధస్సుపై దృష్టిపెట్టే నవీన ప్లాటో వాదముకు ప్రతిస్పందనగా, సంఘము యొక్క ఆది పితరులు క్రైస్తవ వేదాంతశాస్త్రములో మేధోపరమైన ప్రతిబింబమును గూర్చి నొక్కి చెప్పారు. ప్రముఖ క్రైస్తవ

వేదాంతపండుతులు క్రైస్తవ నమ్మకముల యొక్క హేతుబద్ధమైన అన్వేషణ మరియు వివరణపై మునుపెన్నడూ లేని విధంగా దృష్టిని పెట్టారు, తద్వారా క్రొత్త నిబంధన పేర్కొనని మరియు కనిపెట్టని అనేక సిద్ధాంతములు హేతుబద్ధమైన అన్వేషణ యొక్క విషయాలుగా మారాయి.

ఉదాహరణకు, క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రము త్రిత్వము వంటి సిద్ధాంతములను వివరించకుండ విడిచిపెట్టింది; త్రిత్వములోని వ్యక్తుల మధ్య సంబంధమును గూర్చిన వివరణను క్రొత్త నిబంధన రచయుతలు వివరించలేదు. కానీ, సంఘ పితరుల కాలములో, బైబిలు రచయితలు తమ అభిప్రాయములను స్పష్టముగా చెప్పకపోయినప్పటికీ, క్రొత్త నిబంధన రచయితల అభిప్రాయమును గూర్చి వివరించుటకు వేదాంతపండితులు తార్కిక విశ్లేషణను ఉపయోగించారు.

తండ్రియైన దేవుడు, కుమారుడైన దేవుడు మరియు పరిశుద్ధాత్మ దేవుని గూర్చిన అబద్ధ బోధలకు స్పందనగా, ఆదిమ సంఘ పితరులు హేతుబద్ధమైన సమీక్ష ద్వారా ప్రత్యేకతలను జాగ్రత్తగా పరిశీలించుటకు తమనుతాము అప్పగించుకొని, క్రొత్త నిబంధన ప్రస్తావించని విషయములన్నీ వీలైనంతవరకు చర్చించుటకు ప్రయత్నించారు. ఈ విధముగా, వేదాంతశాస్త్రమునకు తార్కికమును అనువర్తించుటవలన వేదాంతపండితులు తమ నవీన ప్లాటో వాదపు ప్రపంచములో పనిచేయుచుండగా అది గొప్ప ప్రాముఖ్యమైన విలువగా మారింది.

మూడవ స్థానములో, మార్మిక సిద్ధాంతముపై నవీన ప్లాటో వాదముకు ఉన్న దృష్టికి ప్రతిస్పందనగా, సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము మార్మిక సిద్ధాంతముపై లేదా ఆత్మీయత జ్ఞానోదయంపై కూడా దృష్టిని కేంద్రీకరించింది.

మార్మిక సిద్ధాంతము. మనము చూచినట్లుగా, నవీన ప్లాటో వాదములో మానవ మనస్సుపై దృష్టి పెట్టి జాగ్రత్తగా తర్కించుట అనేది దేవునితో ఐక్యమైపోయే ఉన్నతమైన మార్మిక స్థాయికి వెళ్లే ఒక పునాది రాయిగా మాత్రమే ఉంది. తర్కము అనేది పరిమితమైనది మరియు ఉన్నతమైన ఆత్మీయ మండలమును గ్రహించలేదు మరియు ఈ ఉన్నతమైన స్థాయిలను అందుకోవాలంటే ప్రత్యేకమైన ప్రత్యక్షత అవసరం.

అదే విధముగా, త్రిత్వము, లేదా క్రీస్తు మానవత్వము లేదా దైవత్వము, లేదా సంస్కారములు మరియు సంఘము, వంటి సిద్ధాంతములను ఆది క్రైస్తవ పితరులు వివరించినప్పుడు, ఈ సిద్ధాంతములలోని కొన్ని విషయాలు మానవ ఆలోచనకు అతీతమైనవని ఒప్పుకున్నారు. తరచుగా, వారి తర్క చర్చలతో పాటుగా క్రైస్తవ విశ్వాసము యొక్క ఉన్నత సత్యములను సులభంగా వివరించలేము లేదా హేతుబద్ధముగా సమర్థించలేమని ఒప్పుకున్నారు. బదులుగా, మార్మిక జ్ఞానోదయం, మానవ ఆలోచనా శక్తిని అధిగమించు అతీంద్రియ అనుభవముల ద్వారానే గ్రహించబడగలదు. సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము దేవుని ప్రత్యక్షత సేవలో తర్కమును ఉపయోగించింది, కానీ అది తార్కిక సాక్ష్యము కంటే ఆత్మీయ విషయములపైనే దృష్టిని ఆధారము చేసుకొనింది.

కాబట్టి సంఘ పితరుల కాలములో వేదాంతపండితులు క్రైస్తవ వేదాంతశాస్త్రమును అన్య ప్రపంచమునకు బోధించుటలో, వివరించుటలో, మరియు సమర్థించుటలో అనేక సవాళ్లను ఎదుర్కొనుట ద్వారా వారి వ్యూహాలు మరియు వక్కాణింపులు మారాయి. భౌతిక విషయాల కంటే ఆత్మీయ లేదా పైనుండి వచ్చిన వేదాంతశాస్త్ర విషయాలకు ప్రాధాన్యతనిచ్చు ఈ మార్పులు, హేతుబద్ధ విశ్లేషణ



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఉపయోగము మరియు మార్మిక సిద్ధాంతముపై ఆధారపడుట అనునవి నేడు మనమెరిగిన క్రమబద్ధ వేదాంతశాస్త్రమునకు దారితీస్తాయి.

వేదాంతపండితులు క్రైస్తవ వేదాంతశాస్త్రమును తమ గ్రీకు సంస్కృతికి ఏ విధముగా వివరించారో ఇప్పటివరకు మనము చూచాము కాబట్టి, ఇప్పుడు మధ్యకాలపు వేదాంతశాస్త్రము వైపు మన దృష్టిని మళ్లించుదాము, ఈ కాలములో మానవుల హేతువాదము మరియు తర్కమును గూర్చిన గ్రీకు ఆలోచనలను తరచుగా క్రైస్తవులు ఉపయోగించారు. క్రీ.శ. 600 నుండి క్రీ.శ. 1500 మధ్యకాలములో అభివృద్ధి చెందిన, "శాస్త్రీయ తత్వము" అని తరచుగా పిలువబడిన వేదాంత ఉద్యమముపై దృష్టి పెడదాము.

## మధ్యయుగ వేదాంతశాస్త్రము

శాస్త్రీయ తత్వమును గూర్చిన మన వివరణ సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రమును మనము చూచిన విధానాన్ని పోలియుంటుంది. ఒక ప్రక్క, శాస్త్రీయ వాదమునకు దారితీసిన సాంస్కృతిక మార్పులను మనము వివరించుదము. మరో ప్రక్క, ఫలితముగా వచ్చిన కొన్ని వేదాంతశాస్త్రములోని మార్పులను అన్వేషించుదము. ఈ శతాబ్దాలలో జరిగిన కొన్ని సాంస్కృతిక మార్పులను మొదట చూద్దాము.

### సాంస్కృతిక మార్పులు

ముందుగా, ఆరంభ మధ్యయుగ ఐరోపాలో "శాస్త్రీయ తత్వము" అను పదము ఉన్నత విద్యనందించు పాఠశాలల ద్వారా నిర్వచించబడినదని మనము చూపించాలి. ఆ పాఠశాలలలో స్థానిక భాషలోని బోధలను, ఆధునిక యుగంలో సాధారణముగా దీనిని "తర్కము" అంటారు, లాటిన్ భాషలో స్కోలాస్టికస్ అని పిలిచేవారు. ఎక్కువగా, ఈ బోధలు అరిస్టోటిల్ తర్కమును బోధించేవి. పర్యావసానముగా, "స్కోలాస్టిక్" అను పదమును ఎక్కువగా అరిస్టోటిల్ తత్వశాస్త్రములోని తర్కపు పద్ధతులపై ఆధారపడు తత్వశాస్త్రమునకు మరియు వేదాంతశాస్త్రమునకు అనువర్తించారు.

మధ్యయుగ కాలములో చోటుచేసుకొన్న అత్యంత ముఖ్యమైన సాంస్కృతిక మార్పులలోని ఒక మార్పు నుండి శాస్త్రీయ తత్వమనేది ఏర్పడింది. మధ్యధరా ప్రపంచములో మేధోశక్తి కలిగిన సమూహాలు నవీన ప్లాటో వాదము నుండి అరిస్టోటిల్ తత్వశాస్త్రము వైపు తిరిగినప్పుడు ఈ మార్పు చోటుచేసుకుంది. ఈ మార్పు ఫలితముగా, అరిస్టోటిల్ తత్వశాస్త్రమునకు అనుగుణంగా క్రైస్తవ సిద్ధాంతములను సమర్థించి వివరించిన వారి విధానములను ప్రముఖ క్రైస్తవులు స్వీకరించారు.

వాస్తవానికి, శాస్త్రీయ తత్వము వైపు గల ఈ మార్పు కొన్ని వందల సంవత్సరముల కాలములో జరిగినది, మరియు దాని యెడల గొప్ప తిరస్కారము కుడా కలిగింది, ప్రత్యేకముగా క్రైస్తవ మార్మిక వాదుల నుండి కలిగినది. అయితే సుమారు 1206 నుండి 1280లో నివసించిన ఆల్బర్ట్ మాగ్నస్, లేదా "మహా ఆల్బర్ట్" కాలానికి, మరియు సుమారు 1225 నుండి 1274 మధ్య నివసించిన ప్రఖ్యాతిగాంచిన అతని శిష్యుడైన థామస్ అక్వినస్ కాలానికి, శాస్త్రీయ తత్వము క్రైస్తవ వేదాంతశాస్త్రము యొక్క ఆధిపత్య రూపమును సూచించింది. సంస్కరణకు ముందు, అరిస్టోటిల్ తత్వశాస్త్రము యొక్క దృక్పథాలకు క్రైస్తవ వేదాంతశాస్త్రము లోతుగా ఆకర్షించబడింది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

శాస్త్రీయ తత్వమునకు నడిపించిన కొన్ని సాంస్కృతిక మార్పులను మనము చూచాము, కాబట్టి ఇప్పుడు దాని యొక్క కొన్ని ప్రధాన లక్షణములను చూద్దాము. క్రైస్తవ వేదాంతశాస్త్రములో శాస్త్రీయ తత్వమనేది ప్రధానమైన పద్ధతిగా చెప్పబడడానికి కారణమేమిటి?

## వేదాంతశాస్త్ర మార్పులు

సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రముకు మరియు శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రముకు మధ్య అనేకమైన సారుప్యతలు ఉన్నప్పటికీ, కనీసము ఒక క్లిష్టమైన వ్యత్యాసము ఉన్నది. మొత్తంగా, గొప్ప వేదాంతపరమైన ఆలోచనలు మర్మమైన ప్రేరణ ద్వారా కలుగుతున్నాయని సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రము పేర్కొంది. అయితే శాస్త్రీయ తత్వము అత్యంత హేతువాదమైనది, మరియు ఇది వేదాంతశాస్త్రమంతటిని గూర్చి అనుకూలంగా మాట్లాడుటలో, అన్వేషించుటలో, వివరించుటలో తర్కశాస్త్రపు విలువను నొక్కి చెబుతుంది. భౌతిక మరియు ఆత్మీయ ప్రపంచములు, మరియు దేవుడు కూడా, తర్కశాస్త్రము ద్వారానే జాగ్రత్తగా విశ్లేషించబడాలి.

అరిస్టోటిల్ రచనలైన తర్కశాస్త్రం, భౌతికశాస్త్రం, మరియు అధిభౌతికశాస్త్రములలో శాస్త్రీయతత్వ వాదకులు ప్రావీణ్యతనొందినవారు, మరియు ఈ హేతుబద్ధ దృష్టిని కలిగయున్న ప్రపంచమునకు క్రైస్తవ వేదాంతశాస్త్రమును గూర్చి తెలియజేయాలని కోరుకున్నారు. ఈ కారణముచే, మధ్యయుగ శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రమును అర్థము చేసుకోవాలంటే, తర్కశాస్త్రముపై అరిస్టోటిల్ యొక్క ఆలోచనల యెడల కొంత అవగాహనను మనము కలిగియుండాలి.

శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రముపై ప్రభావము చూపిన తర్కశాస్త్రము యెడల అరిస్టోటిల్ యొక్క నాలుగు అభిప్రాయములను మాత్రమే చెప్పడానికి సమయము అనుకూలిస్తుంది: మొదటిది, ఖచ్చితమైన అంత్యప్రత్యయము యొక్క ప్రాముఖ్యత; రెండవది, ప్రతిపాదన తర్కము యొక్క అవసరత; మూడవది, స్పష్టమైన తార్కిక న్యాయ ప్రయోగముల విలువ; చివరకు, హేతుబద్ధ విశ్లేషణ యొక్క ప్రాముఖ్యతలు.

అంత్యప్రత్యయము. మొదటిగా, హేతుబద్ధత, తార్కిక అన్వేషణ, విజయమనేవి మనము ఉపయోగించే పదములు మరియు వాటిని జాగ్రత్తగా నిర్వచించే విధానముపై ఆధారపడియుంటుందని అరిస్టోటిల్ అర్థం చేసుకున్నాడు.

ఇప్పుడు, నిర్వచనములు నవీన ప్లాటో వాదకులకు మరియు సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్రులకు కూడా ప్రాముఖ్యమే. అయితే అరిస్టోటిల్ ఈ విషయాలను నిర్వహించిన విధానము మరింత పటిష్టంగా ఉంది. భౌతికశాస్త్రము మరియు అధిభౌతికశాస్త్రముపై తన అభిప్రాయములకు ఆధారంగా, అన్నిటిని పరిగణలోకి తీసుకొని ఒక వస్తువును ప్రత్యేకముగా చూపించుటకు దాని పదార్థము లేదా సారమును మరియు దాని ప్రమాదాలను లేదా అవాంఛనీయ లక్షణములను నిర్వచించుట ద్వారా వస్తువులను వర్గీకరించు ప్రారంభ శాస్త్రీయ విధానాలతో సహా, ఆయన తర్కమును గూర్చి వివరించాడు.

అనుగుణంగా, తమ అరిస్టోటిల్ సంస్కృతితో స్పష్టముగా సంభాషించుటకు, శాస్త్రీయతత్వ వేదాంతపండితులు కూడా సాధ్యమైనంత ఖచ్చితముగా వేదాంత పదాలను నిర్వచించారు.

అరిస్టోటిల్ ఖచ్చితమైన పదజాలానికి ప్రాముఖ్యతనిచ్చే విధానాన్ని శాస్త్రీయతత్వ వాదకులు ఎలా ఉపయోగించారో ఉదాహరించడానికి, అక్వినస్ యొక్క సుమ్మ *థియోలాజిక* నుండి ఒక భాగమును



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

చూద్దాము. “దేవుడు అనంతమైనవాడా?” అను శీర్షిక కలిగిన అధ్యాయములో అక్వినస్ క్రింది ఇవ్వబడిన అభ్యంతరమునకు ఈ విధముగా నివేదించాడు మరియు స్పందించాడు:

> అభ్యంతరము 1. దేవుడు అనంతమైనవాడు కాదన్నట్లు తెలుస్తుంది. అనంతమైన ప్రతిదీ అసంపూర్ణంగా ఉంది … ఏలయనగా దానికి భాగాలు మరియు పదార్థము ఉన్నవి … అయితే దేవుడు అత్యంత పరిపూర్ణుడు; అందువలన ఆయన అనంతమైనవాడు కాడు.

ఈ అభ్యంతరమునకు స్పందించడానికి, అక్వినస్ నిర్వచనము అను అంశముపై దృష్టి పెట్టాడు. ఆయన ఎలా స్పందించాడో వినండి.

> మితముగా చేయబడిన రూపము ద్వారా ఏ పదార్థము కూడా సంపూర్ణము చేయబడదు; అందువలన అనంతము అని చెప్పబడిన పదార్థమునకు అసంపూర్ణ స్వభావము ఉన్నది; ఏలయనగా అది రూపములేని పదార్థముగా నున్నది.

ఈ చిన్న వాక్యభాగములోనే అక్వినస్ అనేక సాంకేతిక పదాలను ఉపయోగించాడు. అతడు “పదార్థము,” “రూపము,” “నిరాకారము,” “మితము,” “అనంతము,” “సంపూర్ణము” మరియు “అసంపూర్ణము” వంటి పదాలను ఉపయోగించాడు. మరియు తన కాలపు వారు అర్థము చేసుకొను రీతిలో అతడు ఈ సాంకేతిక పదాలను ఉపయోగించాడు ఎందుకంటే అవి అరిస్టోటిల్ అట్టి పదాలను ఉపయోగించిన విధానమునకు అనుగుణంగా ఉన్నాయి. పర్యవసానముగా, అక్వినస్ తన ఆలోచనలకు మరియు ఇతరుల ఆలోచనలకు మధ్య వ్యత్యాసములను చూపించగలిగాడు. అంత్యప్రత్యయము యొక్క ఖచ్చితమైన నిర్వచనములపై ఈ దృష్టి శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రము యొక్క లక్షణముగా ఉన్నది.

ఈ దృష్టి ఫలితముగా, శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రము సాంకేతిక పదాలతో నిండిపోయింది. క్రైస్తవ వేదాంతశాస్త్రము కొరకు విస్తృతమైన ప్రత్యేక పదజాలమును శాస్త్రీయతత్వవేత్తలు అభివృద్ధి చేసారు. మరియు వారి పదజాలము క్రైస్తవ వేదాంతశాస్త్రములో శతాబ్దాలుగా ఉపయోగించబడుతూ ఉంది కాబట్టి ఇది మనకు ప్రాముఖ్యమైనది.

తర్కశాస్త్రముపై అరిస్టోటిల్ యొక్క రచనలు ఖచ్చితమైన పదజాలమును నొక్కి చెప్పాలని శాస్త్రీయతత్వ వేదాంతపండితులకు స్ఫూర్తినిచ్చుటతో పాటుగా, వేదాంత సత్యాలను మాట్లాడుటలో ప్రతిపాదనలకు కీలక పాత్రనిచ్చుటలో వారిని ప్రోత్సహించింది.

ప్రతిపాదనలు. సరళమైన రూపములో, ప్రతిపాదనలు అనేవి విషయము (సబ్జెక్టు) మరియు సంభావ్యత (ప్రెడికేట్) ద్వారా రూపొందించబడిన సత్యమును నొక్కి చెప్పడము. మన అనుదిన ఉపన్యాసములలో ప్రతిపాదనలను ఉపయోగిస్తూనే ఉంటాము. “నేను మనిషిని” అను పదసమూహమును గమనించండి. ఈ ప్రతిపాదనలో, “నేను” అనేది విషయము మరియు “మనిషిని” అనేది సంభావ్యత. వేదాంతశాస్త్రములో “యేసు దేవుని కుమారుడు” వంటి ప్రతిపాదనలు మనకు బాగుగా తెలిసినవే. ఇటువంటి సత్యములను గూర్చి నొక్కి చెప్పే ప్రతిపాదనలు శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రమునకు ప్రాముఖ్యమైనవిగా ఉన్నాయి ఏలయనగా అవి అరిస్టోటిల్ తర్కశాస్త్ర విశ్లేషణ ఆకారంలో ఉన్నవి.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

తారిక్క హేతువాదమనునది ప్రతిపాదనలతో ఎలా పనిచేస్తుంది అను విషయముపై అరిస్టోటిల్ ఎక్కువ దృష్టిని పెట్టాడు. ఆయన అభిప్రాయములో, అంతర్దృష్టి లేదా భావోద్వేగాలు, కవిత్వం లేదా ప్రతీకవాదం, విడికథ లేదా ప్రార్థనలు వంటి వ్యక్తీకరణలతో తర్కము పని చేయదు. తర్కము ప్రధానంగా వాస్తవాల యొక్క ప్రకటనలతో ముడిపడి యుంటుంది. సరిగా రూపొందించబడిన ప్రతిపాదనలతో మాత్రమే ఒక అంశాన్ని విశ్లేషించడానికి మనము తర్కమును ఉపయోగించవచ్చు.

అరిస్టోటిల్ ప్రాముఖ్యతనిచ్చిన దానికి అనుగుణంగా, శాస్త్రీయ తత్వము దాని యొక్క సాధారణ వేదాంతశాస్త్రమును ప్రతిపాదనలలో వ్యక్తము చేయడానికి కష్టపడుతుంది. ఇప్పుడు, తక్కువ సాధరణ, తక్కువ విద్యాస్థాయిలో, క్రైస్తవ విశ్వాసములో ఇతర వ్యక్తీకరణలు కూడా ఉండాలని శాస్త్రీయతత్వ వేదాంతపండితులు అర్థము చేసుకున్నారు. చాలామంది శాస్త్రీయతత్వ పండితులు పవిత్రులు మరియు తమ మతపరమైన ఒప్పుకోలులను పద్యము, పాటలు, ప్రార్థనలు మరియు ఇతర విషయాల ద్వారా వ్యక్తపరచారు. అయితే అధునాతన విద్యాసంబంధమైన సందర్భాలలో, వేదాంతపరమైన నమ్మకాలనేవి జాగ్రత్తగా నిర్మించబడిన ప్రతిపాదనలలో, వాస్తవాల ఉద్ఘాటనలలో సమర్పించబడ్డాయి.

శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రములోని ప్రతిపాదనల యొక్క ప్రాధాన్యతను ఉదాహరించాలంటే, మరోసారి అక్వినస్ యొక్క *సుమ్మ థియోలాజిక* వైపు తిరగాలి. "దేవుని జ్ఞానము స్వయం-నిర్ధారణగా ఉన్నదా?" అను శీర్షిక కలిగిన అధ్యాయముపై ఆయన చర్చను విందాము.

> అభ్యంతరము 1. దేవుని ఉనికి స్వయం-నిర్ధారణగా ఉన్నట్లు కనిపిస్తుంది. మొదటి సూత్రాలలో మనము చూచినట్లుగా, మనకు స్వయం నిర్ధారణగా తెలుపబడిన విషయాలను గూర్చిన జ్ఞానము సహజముగా మనలో నాటబడియుంటుంది. అయితే డమాస్కీన్ చెప్పినట్లుగా (ఎనిమిదవ శతాబ్దపు డమాస్కీన్ ను ప్రస్తావిస్తూ) "దేవుని జ్ఞానము సహజముగా అన్నింటిలో నాటబడియున్నది." అందువలన దేవుని ఉనికి స్వయం-నిర్ధారణగా ఉన్నది.

ఈ అభ్యంతరమునకు అక్వినస్ ఇలా స్పందించాడు.

> ప్రదర్శన యొక్క మొదటి సూత్రాలకు సంబంధించి తత్వవేత్త (అరిస్టోటిల్ ను సూచిస్తూ) చెప్పినట్లుగా స్వయం-నిర్ధారణగా ఉన్న విషయము యొక్క వ్యతిరేక భావమును ఎవరును మనస్సులో ఒప్పుకోరు. అయితే "దేవుడు ఉన్నాడు" అను ప్రతిపాదనకు వ్యతిరేకమును మనస్సులో ఒప్పుకోవచ్చు: "'దేవుడు లేడని' బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు." (కీర్తనలు 53:1). అందువలన, దేవుడు ఉన్నాడు అనేది స్వయం-నిర్ధారణ కాదు.

మనము ఊహించినట్లుగా, "వ్యతిరేక భావనను ఏ ఒక్కరు మనస్సులో ఒప్పుకోరు" అని స్వయం నిర్ధారణకు అరిస్టోటిల్ ఇచ్చిన సాంకేతిక అర్థమును ఈ వాక్యభాగము సూచిస్తుంది. కానీ దీనికి అతీతముగా, అక్వినస్ తన అభ్యంతరకునికి ప్రతిపాదనతో స్పందించడము మనము చూస్తాము. అతడు ప్రశంసలు లేదా విలాపముతో స్పందించలేదు. అతడు తన ప్రత్యర్థిని తిట్టలేదు లేదా బెదిరించలేదు. బదులుగా, అతడు తరచుగా ప్రతిపాదనలతోనే స్పందించేవాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

ఇక్కడ మనము అక్వినస్ లో చూస్తున్నది సాధారణంగా శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రము యొక్క లక్షణముగా ఉంది. శాస్త్రీయతత్వ పండితులు తమ సాధారణ వేదాంత చర్చలను అన్నింటిని ప్రతిపాదనలకు పరిమితము చేసారు. జాగ్రత్తగా నిర్వచించిన పదములను వాస్తవ ప్రకటనలలో బాగుగా-అమరిక చేసి వేదాంత సమస్యలను తర్కించారు. ఈ లక్షణం అధికారిక క్రైస్తవ వేదాంతశాస్త్రమునకు కేంద్రముగా మారింది తద్వారా మన కాలములో కూడా క్రమబద్ధ వేదాంతశాస్త్రములో ప్రతిపాదనలు కీలకమైనవిగానే ఉన్నాయి.

తర్కశాస్త్రముపై అరిస్టోటిల్ యొక్క స్పందనతో వ్యవహరించిన శాస్త్రీయతత్వము యొక్క మూడవ విధానము స్పష్టమైన న్యాయ ప్రయోగమను (సిల్లోజిసం) వర్గములో సంగ్రహించబడుతుంది.

స్పష్టమైన న్యాయ ప్రయోగము. ఒక పదములో, స్పష్టమైన న్యాయ ప్రయోగము అనునది ప్రమేయములు మరియు ముగింపులను రూపొందించడానికి ఏర్పాటు చేయబడిన ప్రతిపాదనలు కలిగియున్న తర్క వాదము.

ఉదాహరణగా, ప్రాథమిక తర్క పాఠ్యపుస్తకాలలో తరచు బోధించబడే ఒక ప్రసిద్ధిగాంచిన స్పష్టమైన న్యాయ ప్రయోగము ఈ విధముగా ఉంటుంది: ప్రతిపాదన ఒకటి: సోక్రేటిస్ ఒక మనిషి. ప్రతిపాదన రెండు: మనుష్యులందరూ మర్త్యమైనవారు. ముగింపు: అందువలన, సోక్రేటిస్ కూడా మర్త్యమైనవాడే.

కొన్ని విధములైన తీర్మానములకు నడిపించే వాదనలుగా ప్రతిపాదనలు ఎలా క్రమపరచబడతాయో గుర్తించుటకు అరిస్టోటిల్ చాలా సమయము గడిపాడు. గుర్తింపు నియమము, వైరుధ్యములేని నియమము, మినహాయించబడిన మధ్యవర్తిత్వ నియమము, అదే విధముగా ఊహను గూర్చిన వివిధ సక్రమత నియమాలు, వివిధ ప్రతిపాదనల నుండి సరిగా లేదా తార్కికముగా వివిధ తీర్మానములను పరోక్షంగా చూచే మార్గాల వలె “తర్క నియమములు”గా పిలువబడే దానిని ఆయన అన్వేషించాడు.

వాస్తవానికి, నిజమైన వేదాంత వాదనలు సంక్లిష్టమైనవిగా ఉంటాయి, కానీ శాస్త్రీయతత్వ వేదాంతపండితులు అరిస్టోటిల్ నియమాలకు అనుగుణంగా ఉన్న వేదాంతశాస్త్ర వాదనలను రూపొందించడానికి ఉద్దేశించారు.

సుమ్మ *థియోలాజికలో*ని “దేవుని జ్ఞానము స్వయం-నిర్ధారణగా ఉన్నదా?” అను విషయముపై అక్వినస్ చర్చను మరొకసారి గమనించుదాము. తిన్ననైన స్పష్టమైన న్యాయ ప్రయోగము ద్వారా దేవుని జ్ఞానము స్వయం-నిర్ధారణమైనది అను ప్రతిపాదనకు అక్కడ ఆయన స్పందించాడు. ఆయన ఈ పదాలు వ్రాసాడు:

> స్వయం-నిర్ధారణగా ఉన్న విషయము యొక్క వ్యతిరేక భావమును ఎవరును మనస్సులో ఒప్పుకోరు ... కానీ “దేవుడు ఉన్నాడు” అనే మాట యొక్క వ్యతిరేకమును మనస్సులో ఒప్పుకోవచ్చు: “‘దేవుడు లేడని’ బుద్ధిహీనులు తమ హృదయములో అనుకొందురు.” అందువలన, దేవుడు ఉనికిలో ఉన్నాడను విషయము స్వయం-నిర్ధారణమైనది కాదు.

ఇక్కడ ఇవ్వబడిన స్పష్టమైన న్యాయ ప్రయోగమును ఈ విధముగా చెప్పవచ్చును. ప్రతిపాదన ఒకటి: స్వయం-నిర్ధారణ యొక్క వ్యతిరేకమును ఏ ఒక్కరు మనస్సులో ఒప్పుకోలేరు. ప్రతిపాదన రెండు:



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

"దేవుడు ఉన్నాడు'" అనే మాట యొక్క వ్యతిరేకమును మనస్సులో ఒప్పుకోవచ్చు. ముగింపు: అందువలన, దేవుడు ఉన్నాడు అను మాట స్వయం-నిర్ధారణమైనది కాదు.

జాగ్రత్తగా నిర్మించబడిన స్పష్టమైన న్యాయ ప్రయోగములతో అక్వినస్ తన వేదాంతమును అన్వేషించి ఎలా కాపాడుకొన్నాడో చూచుటకు ఈ వాక్యభాగము ఒక ఉదాహరణ. ఆయన ఈ అంశముపై వ్యవహరించిన విధానము మధ్యయుగ శాస్త్రీయతత్వమునకు విలక్షణంగా ఉన్నది. వాస్తవంగా, స్పష్టమైన న్యాయ ప్రయోగముపై ఈ విధమైన దృష్టి మన కాలములో కూడా క్రమబద్ధ వేదాంతశాస్త్రమునకు కేంద్ర లక్షణముగా ఉన్నది.

సాంకేతిక పదములపై దృష్టి పెట్టడం, ప్రతిపాదనలు మరియు తార్కిక స్పష్టమైన న్యాయ ప్రయోగముపై ఆధారపడడంతో పాటుగా, శాస్త్రీయతత్వ పండితులు అరిస్టోటిల్ ప్రభావమును తమ వేదాంతశాస్త్రము యొక్క ప్రాధాన్యతల ద్వారా చూపించారు.

ప్రాధాన్యతలు. స్థిరమైన, హేతుబద్ధమైన, సోపానక్రమం పరంగా వాస్తవికతను విశ్లేషించే బాధ్యతకు అరిస్టోటిల్ తర్కమును అనువర్తించాడు. ప్రతిదీ నిలువ (వర్టికల్) హేతుబద్ధ క్రమంలో చోటుచేసుకొన్నట్లు చూశాడు. ఆయన అభిప్రాయంలో, అన్ని విషయములు ఒక కొలబద్ద యొక్క దిగువ అంచున ఉన్న వేర్వేరు అసంపూర్ణతలు మరియు పై అంచున ఉన్న స్వచ్ఛమైన ఐక్యత మరియు పరిపూర్ణ రూపమునకు మధ్య ఉన్నాయి. ఈ హేతుబద్ధ క్రమములోనే ప్రతి విధమైన వాస్తవికత యొక్క స్థానము ఎక్కడ సరిపడుతుందో గుర్తించడం తత్వశాస్త్రము యొక్క అనేక బాధ్యతల్లో ఒకటిగా ఉన్నదని ఆయన నమ్మకం.

సులభమైన పదాల్లో, దేవుడు తానే కొలబద్దకు పై అంచున ఉన్నాడు. ఆయన ప్రధానుడు, సమస్తమును సృష్టించుటకు సృష్టించబడనివాడు. దేవుడు స్వచ్ఛ ఐక్యత, స్వచ్ఛ రూపము, స్వచ్ఛ జీవము గలవాడు. దేవదూతలు దేవునికంటే ఒక అడుగు క్రింద ఉన్నారు. వారు ఆత్మ మరియు శరీరమును కలిగినవారు కాబట్టి మానవులు దేవదూతల క్రింద ఉన్నారు. అనేక రకాలైన జంతువులు తమ స్థానమును మానవుల క్రింద కలిగియున్నవి; తరువాత మొక్కలు; తదుపరి ఆకర్బన పదార్థములు; తరువాత గాలి, అగ్ని, భూమి మరియు నీరు అను నాలుగు ప్రాథమిక మూలకాలు; మరియు చివరగా ప్రధాన పదార్థము దిగువన ఉంటుంది.

తమ అరిస్టోటిల్ సంస్కృతులతో సంభాషించడానికి, ఈ అరిస్టోటిల్ పద్ధతి ప్రకారంగా తమ వేదాంతశాస్త్రమును వివరించడానికి శాస్త్రీయతత్వ పండితులు ప్రయత్నించారు. పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము యొక్క క్రమములో వారి సిద్ధాంత సారాంశములను బలముగా నిర్దేశించారు. అనగా, వారు అరిస్టోటిల్ సోపానక్రమము యొక్క ఉన్నత స్థాయిలకు సమాంతరంగా ఉన్న క్రైస్తవ బోధలతో ఆరంభించి దృష్టి పెట్టడం మొదలుపెట్టారు తదుపరి అరిస్టోటిల్ కొలబద్ద యొక్క తక్కువ స్థాయిలతో సమాంతరంగా ఉన్న బోధలపై దృష్టి పెట్టారు. అన్నివేళలా, ప్రతి భాగము ఇతర భాగములతో ఎలా సరిపోతుందో వివరిస్తూ, తమ పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రమంతటిపై ఆవరించిన క్లిష్టమైన హేతుబద్ధ క్రమాన్ని స్పష్టం చేయడానికి చూచారు.

పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రముపై ఈ విధమైన ధోరణిని థామస్ అక్వినస్ సుమ్మ *థియోలాజిక* అమరికలో స్పష్టముగా చూడవచ్చు. ఆయన సుమ్మలో ఒకటవ భాగము ఉపోద్ఘాతముతో ఆరంభమై శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్రములో ఉన్నత ప్రాధాన్యతగల అంశమువైపు కొనసాగుతుంది: అద్వితీయ దేవుడు. తదుపరి అక్వినస్ ఆశీర్వాదకరమైన త్రిత్వము వైపు మరలాడు. తరువాత, అతడు సృష్టి మీద

దృష్టి పెట్టాడు, మరియు ఇది అన్ని విషయాలకు మొదటి కారణం దేవుడేయని ఇంకనూ శ్రద్ధ చూపుతున్న అధ్యాయము. తదుపరి సృష్టిలో గొప్ప దానివైపు మరలాడు అక్వినస్. దేవదూతలు తరువాత, దేవదూతలకు క్రింది ఉన్న భౌతిక సృష్టిని సూచించే ఆరు దినముల సృష్టిని ఆయన చర్చించాడు. అటు తరువాత ఆత్మ మరియు శరీరమును కలిగియున్న మానవత్వమును అధ్యాయము ఉన్నది. చివరగా, భౌతిక ప్రపంచములో ఉన్న వాటితో సహా సృష్టియంతటిపై దేవుని ప్రభుత్వమును గూర్చి చెప్తూ అక్వినస్ సుమ్మలోని భాగము ఒకటిని ముగించాడు. అక్వినస్ యొక్క సుమ్మ *థియోలాజికలో* ప్రతిబింబించిన అరిస్టోటిల్ ప్రాధాన్యతలు శాస్త్రీయతత్వము యొక్క సాధారణ వ్యూహమును చూపిస్తాయి. మరియు ఈ ధోరణి శతాబ్దాలుగా అధికారిక క్రైస్తవ వేదాంతశాస్త్రమును కలిగియుంది, మరియు ఇది అధునాతన ప్రొటెస్టెంట్ క్రమబద్ధ వేదాంతశాస్త్రములో కూడా ఉంది.

క్రైస్తవ వేదాంతశాస్త్రము క్రొత్త నిబంధన పద్ధతుల నుండి గ్రీకుల ఆలోచన విధానములోకి మారిన కొన్ని విధానములను మనము ఇప్పటివరకు చూచాము — మొదటిగా సంఘ పితరుల కాలములోని నవీన ప్లాటో ద్వంద్వాదమును, మరియు తదుపరి మధ్యయుగములోని అరిస్టోటిల్ హేతువాదమును చూచాము — కాబట్టి ఇప్పుడు ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రము ఈ అభివృద్ధులతో పోల్చబడిన మార్గాలను మనము చూద్దాము.

## ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రము

ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రమును పరిశీలించడానికి చాలా మార్గాలు ఉన్నాయి గనుక ఒక చిన్న భాగమునకు మాత్రమే మనలను మనం పరిమితం చేసుకోవాలి. ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రములో మూడు దశలను మనము చూద్దాము: మొదటిగా, 16వ శతాబ్దపు ఆరంభ సంస్కర్తల వేదాంతశాస్త్రము; రెండవదిగా, సాంప్రదాయిక ప్రొటెస్టెంట్ల ఒప్పుకోలులు; మరియు మూడవదిగా, ఆధునిక ప్రొటెస్టెంట్ క్రమబద్ధ వేదాంతశాస్త్రము. ప్రారంభ సంస్కర్తల వేదాంతశాస్త్రముతో ఆరంభించుదము.

### ప్రారంభ సంస్కర్తలు

లేఖనముల ఆధారముగా క్రైస్తవ వేదాంతశాస్త్రమును పునఃనిర్మించుట ప్రారంభ ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యమైయుండినది. ఉదాహరణకు, మార్టిన్ లూథర్ మరియు జాన్ కెల్విన్, వేదాంతశాస్త్రములో బైబిలు అధికారమును పునరుద్ఘాటించాలని ప్రగాఢమైన వాంఛ కలిగియుండిరి. వారు రోమన్ కాథలిక్ సిద్ధాంతములను మరియు విప్లవాత్మకులైన అనాబాప్టిస్ట్ల సవాళ్లను ప్రత్యక్షంగా లేఖనముల ద్వారా ఎదుర్కొన్నారు.

ఫలితముగా, లూథర్ లేదా కెల్విన్ ఆధునిక క్రమబద్ధ వేదాంతశాస్త్రమునకు అనుగుణంగా ఉన్న దేనిని వ్రాయలేదు. బదులుగా, లూథర్ ప్రతినిధియైన ఫిలిప్ మేలాంచన్ మరియు కెల్విన్ అనుచరుడైన థియోడర్ బీజా అనువారు ప్రారంభ ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రమును క్రమపరచారు. అయినను, ప్రారంభ సంస్కర్తల రచనలలో కూడా సంఘ పితరుల కాలపు వేదాంతశాస్త్ర మరియు శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్ర లక్షణాలు ఉన్నాయి.

ఉదాహరణగా, ఇన్స్టిట్యూట్స్ *అఫ్ క్రిస్టియన్ రిలీజియన్* అను ప్రసిద్ధిచెందిన కెల్విన్ రచనను గమనించండి. మత విరోధమైన సిద్ధాంతముల (హెరెసి) నుండి ప్రొటెస్టెంట్లను రక్షించడానికి ఇన్స్టిట్యూట్స్

మొట్టమొదటిగా వ్రాయబడింది. అయితే ప్రొటెస్టెంట్ల అభిప్రాయములను కాపాడుకొనుటలో, సంస్కరణకు కొన్ని శతాబ్దముల ముందు వేదాంతశాస్త్రము నిర్మించుటకుగాను అభివృద్ధి చెందిన విధములకు ప్రాముఖ్యమైన సమీప అనుబంధములను కెల్విన్ ప్రతిబింబించాడు. ఇప్పుడు, కెల్విన్ కేవలము సంఘ పితరుల కాలపు లేదా శాస్త్రీయతత్వ వేదాంతశాస్త్ర పద్ధతులను అనుసరించాడు అని చెప్పడం న్యాయం కాదు. ఏదేమైనా, ఇన్స్టిట్యూట్స్ లో అరిస్టోటిల్ సాంకేతిక పదాలలో ఉపయోగించిన తర్కము యెడల ప్రాముఖ్యమైన శ్రద్ధను చూపించాడు; ఆయన వేదాంతమును ఎక్కువగా ప్రతిపాదనలలో వ్యక్తపరచాడు; అంశాలను తర్కించడానికి స్పష్టమైన న్యాయ ప్రయోగమును నిర్మించాడు; మరియు పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము ప్రాధాన్యతలకు అనుగుణంగా తన వేదాంతశాస్త్రమును నిర్మించుకున్నాడు.

కెల్విన్ రచనలోని ప్రతి విషయమును చర్చించుకొనుటకు సమయము సరిపోదు గనుక, వేదాంతశాస్త్రములో కేంద్ర సాధకంగా ఉన్న హేతువాదమును మరియు పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము ప్రాధాన్యతలను ఆయన అనుసరించిన విధానమును చూద్దాము. ఒకవైపు, తర్కశాస్త్రము లేదా తర్కమును అధ్యయనము చేయుటలోగల ప్రయోజనములను, అవి అవిశ్వాసులచే అభివృద్ధి చేయబడినప్పటికీ కూడా, కెల్విన్ నొక్కి చెప్పిన విధానమును వినండి.

ఇన్స్టిట్యూట్స్ లోని రెండవ పుస్తకము రెండవ అధ్యాయములో, ఆయన ఈ మాటలను వ్రాసాడు.

> **భౌతికశాస్త్రము, తర్కశాస్త్రము, గణితశాస్త్రము, మరియు ఇతర సారూప్య విజ్ఞాన శాస్త్రాలలో భక్తిహీనుల ద్వారా దేవుడు మనకు సహాయము మరియు పరిచర్య చేయుటకు ఇష్టపడుతుంటే, మనము దాని నుండి పొందుకుందాం, లేదంటే, మనకు అందించబడిన దేవుని బహుమానములను నిర్లక్ష్యం చేస్తే, మన సోమరితనమును బట్టి మనమే శిక్షించబడతాము.**

తర్కశాస్త్రము లేదా తర్కము యొక్క ఈ ఆమోదమునకు అనుగుణంగా, కెల్విన్ రచనలు కేవలము లేఖనములు బోధించే విషయాలపట్ల శ్రద్ధ చూపించడం మాత్రమే కాదుగానీ ఆ బైబిలానుసారమైన బోధలను అరిస్టోటిల్ తర్క ప్రమాణాలకు అనుగుణమైన మార్గాల్లో వివరించడానికి కూడా శ్రద్ధ చూపుతాయి.

మరోవైపు, మధ్యయుగ వేదాంతశాస్త్ర నిర్మాణములను దగ్గరగా ప్రతిబింబించు విధములలోనే కెల్విన్ రచించిన ఇన్స్టిట్యూట్స్ అనే పుస్తకము కూడా పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము యొక్క ప్రాధాన్యతలను పెద్ద ఎత్తున ప్రతిబింబిస్తున్నవి. ఇన్స్టిట్యూట్స్ నాలుగు పుస్తకాలుగా విభజించబడ్డాయి: మొదటి పుస్తకము సృష్టికర్తగా దేవుని జ్ఞానమును గూర్చి చర్చిస్తుంది. ఈ పుస్తకములో దేవునిని గూర్చి మరియు దేవుడు సర్వోన్నతుడైన సృష్టికర్తగా మరియు విశ్వమును నియంత్రించేవానిగా వివరించాడు. రెండవ పుస్తకము విమోచకునిగా దేవుని జ్ఞానముపై దృష్టి పెడుతుంది; క్రీస్తు తన ప్రజల కొరకు రక్షణను నెరవేర్చినట్లుగా ప్రపంచములో దేవుని జోక్యమునకు సంబంధించిన మరిన్ని భూసంబంధమైన విషయాలను ఇది పరిగణిస్తుంది. మూడవ పుస్తకము కృప పొందుకోవడం, దాని ప్రయోజనములు మరియు ప్రభావములను గూర్చి చర్చిస్తుంది. క్రీస్తులో నెరవేర్చబడిన రక్షణ వ్యక్తిగతముగా ప్రజలకు ఎలా వర్తిస్తుంది అను విషయమును మరియు రక్షణను పొందుకొనిన ప్రజల వ్యక్తిగత జీవితాలలో రక్షణ అనునది ఎటువంటి ఆశీర్వాదాలు మరియు ప్రభావాలను తెస్తుంది అను విషయమును కెల్విన్



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

వివరించాడు. నాల్గవ పుస్తకము మరింత తక్కువస్థానములో ఉన్న, ఆచరణాత్మకమైన విషయాలపై దృష్టి పెడుతుంది: సంఘము, దాని సంస్కారము, మరియు పౌర ప్రభుత్వము యెడల దాని సంబంధము.

కాబట్టి, కెల్విన్ అధిక ఖగోళ భావనల నుండి తక్కువ మరియు మరింత లౌకిక విషయాలవైపు తరలినట్లుగా మనము చూడగలము. దేవుడు సృష్టిపై గొప్ప సార్వభౌమ అధికారము గలవాడు అను విషయమును మొదటిగా చర్చించాడు. క్రీస్తులో దేవుడు చరిత్రలో జోక్యం చేసుకున్నాడు అనునది రెండవ విషయముగా చర్చించాడు. వ్యక్తిగత ప్రజల రక్షణ అనేది తదుపరి చర్చించాడు. చివరిగా, ఆచరణాత్మక, అనుదిన క్రైస్తవ ఆందోళనల విషయాలను చర్చించాడు.

కాబట్టి, పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము మరియు తర్కము యెడల అతని ఆమోదము ప్రకారము, సంస్కరణకు మునుపే సంఘ చరిత్రలో అభివృద్ధిచెందిన వేదాంత పద్ధతులను మరియు ప్రాధాన్యతలను కెల్విన్ అనుసరించాడు.

వేదాంతశాస్త్రము యొక్క ఆరంభ అభివృద్ధులపై ఆదిమ ప్రొటెస్టెంట్ వేదాంతము ఆధారపడు విషయమును మనము గుర్తించుటతో పాటుగా, ప్రొటెస్టెంట్ల ఒడంబడికల వారసత్వము విషయములో కూడా అదే నిజమని మనము చెప్పాలి. ప్రపంచములోని వేర్వేరు ప్రాంతములకు చెందిన ప్రొటెస్టెంట్లు తమ విశ్వాసమును సంగ్రహించు పలు సాంప్రదాయిక కేటకిజంలను మరియు ఒప్పుకోలులను ఉత్పత్తి చేసారు.

## సాంప్రదాయిక ఒప్పుకోలులు

ఉదాహరణ కొరకు, సుమారు 1647లో వ్రాయబడిన *వెస్ట్ మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* యొక్క వేదాంతశాస్త్రమును గమనించండి. ఆరంభ ప్రొటెస్టెంట్లవలె, లేఖన బోధనకు ప్రాముఖ్యతనిచ్చినంత మాత్రమున వెస్ట్ మినిస్టర్ వేదాంతశాస్త్రమును కేవలము శాస్త్రీయతత్వముగా పిలవడం న్యాయం కాదు. ఇప్పటికీ, *ఒప్పుకోలు* అనునది మధ్యయుగ వేదాంతశాస్త్ర దృక్పథము వలన ప్రభావితం చేయబడినదనిన విషయం వాస్తవం. అరిస్టోటిల్ తర్కము సాంకేతిక పదాలపై ఆధారితమైన విధానము, ప్రతిపాదనలు వ్యక్తీకరణము యొక్క కేంద్రముగా ఉన్న విధానము, వేదాంతశాస్త్రమును అందించుటలో గల స్పష్టమైన న్యాయ ప్రయోగం యొక్క విధానము, మరియు పై నుండి వచ్చిన వేదాంతశాస్త్ర ప్రాధాన్యతల పరముగా వేదాంతశాస్త్ర అంశములను అది ఏర్పరచే విధానములన్నిటిని *ఒప్పుకోలు* హత్తుకొంటుంది.

*వెస్ట్ మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* లో తర్కము యొక్క అత్యంత ప్రాముఖ్యమైన పనిని మనము చూడగలము. ఇది ప్రత్యేకముగా ఒకటవ అధ్యాయము, ఆరవ పేరాలో స్పష్టమౌతుంది. అది ఏలా ఉన్నదో చూడండి.

> **ఆయన మహిమ, మానవుని రక్షణ, విశ్వాసము మరియు జీవితమునకు, అవసరమైన విషయాలన్నిటిలో దేవుని సలహా అనేది, లేఖనములో వ్యక్తీకరించబడియుండవచ్చు, లేదా మంచి లేదా అవసరమైన పర్యవసానము లేఖనము నుండి ఊహించబడవచ్చు.**

దేవుని మహిమ మరియు మన రక్షణ, విశ్వాసము మరియు జీవితమునకు అవసరమైన ప్రతిదీ రెండు మార్గాల్లో కనిపిస్తుందన్న విషయమును ఇక్కడ గమనించండి. ఒకవైపు, ఈ సత్యములు స్పష్టముగా లేఖనములో చెప్పబడినవి. అనగా, బైబిలు కొన్ని ప్రాముఖ్యమైన సత్యములను స్పష్టముగా బోధిస్తుంది. అయితే మరోవైపు, ఇతర క్రైస్తవ సిద్ధాంతములు బహుశా "మంచి మరియు అవసరమైన

పర్యవసానములను లేఖనము నుండి ఊహించవచ్చు." ఈ కథనము ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రములో హేతువాదముకు లేదా తర్కమునకు ముఖ్యమైన పాత్రను ఇస్తుంది. ఈ ప్రొటెస్టెంట్ వేదాంతపండితులు తమ పనిని చేసినప్పుడు, లేఖనములోని అన్వయింపును గ్రహించడానికి హేతువాదమును లేదా తర్కమును వారు ఉపయోగించెడివారు. ఈ విధముగా, *వెస్ట్ మినిస్టర్ కన్ఫెషన్ ఆఫ్ ఫెయిత్* పూర్వకాలపు పద్ధతుల యొక్క ఖచ్చితమైన ధోరణిని వెల్లడిచేస్తుంది.

దీనికంటే, విశ్వాసపు ఒప్పుకోలు యొక్క విస్తృత ఆకారము కూడా పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము యొక్క ప్రాధాన్యతలను ప్రత్యక్షపరుస్తుంది. *ఒప్పుకోలు*లోని అధ్యాయములు ఈ క్రమమును అనుసరిస్తాయి: "లేఖనము యొక్క," అను శీర్షిక కలిగిన ఆరంభ అధ్యాయము తరువాత రెండు మరియు మూడు అధ్యాయములు ఉన్నత ఆత్మీయ వాస్తవికతను అనగా — దేవునిపై దృష్టి పెడతాయి. తరువాత, నాలుగు మరియు ఐదు అధ్యాయములు సృష్టిని గూర్చి చర్చిస్తాయి. అటు తరువాత ప్రాపంచిక లేదా భూసంబంధమైన అంశాలపై దృష్టిపెడతాయి, అధ్యాయములు ఆరు నుండి పదిహేడు వరకు మానవాళి పాపములో పడిపోయిన విధానము మరియు విమోచన విధానమును గూర్చి చర్చిస్తాయి. తదుపరి, అధ్యాయములు పదునెనిమిది నుండి ముప్పైఒకటి వరకు సంఘము మరియు క్రైస్తవ జీవితమునకు సంబంధించిన ఆచరణాత్మక విషయాలను చరిస్తాయి. చివరిగా, ముప్పై-రెండు మరియు ముప్పై-మూడు అధ్యాయాలు ప్రపంచ చరిత్ర ముగింపును గూర్చి మాట్లాడుతాయి.

ఈ ఆకారములో ప్రస్తుతించబడిన వేదాంతశాస్త్ర ప్రాధాన్యతలు అనేకమైన సాంప్రదాయ ప్రొటెస్టెంట్ ఒప్పుకోలులను మరియు క్రైస్తవ హితోపదేశమును కలిగియున్నాయి.

ప్రారంభ ప్రొటెస్టెంట్ వేదాంతశాస్త్రము యొక్క ఈ సాధారణ ధోరణులు మరియు సాంప్రదాయ ప్రొటెస్టెంట్ ఒప్పుకోలులను మనస్సులో ఉంచుకొని, ఆధునిక క్రమబద్ధ వేదాంతశాస్త్రము అదే విధమైన ధోరణులను కొనసాగిస్తుందని మనము గ్రహించవచ్చు.

### ఆధునిక క్రమబద్ధతలు

ఉదాహరణ కొరకు, 1797 నుండి 1878 వరకు నివసించిన ప్రిన్స్ టన్ సెమినరీలోని చార్లెస్ హడ్జ్ యొక్క క్రమబద్ధ వేదాంతశాస్త్రమును గమనించుదాము. ఆయన క్రమబద్ధ వేదాంతశాస్త్రమంతటిలో, సాంప్రదాయ సాంకేతిక పదాలను ఉపయోగించినప్పుడు, ప్రతిపాదనలపై ఆధారితమైనప్పుడు, స్పష్టమైన న్యాయ ప్రయోగమును జాగ్రత్తగా ఉపయోగించి తన ఆలోచనను నిర్మించుకున్నప్పుడు, హేతువాదము మరియు తర్కమునకు హడ్జ్ కేంద్ర స్థానమును ఇచ్చి మరియు పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము యొక్క ప్రాధాన్యతలను అనుసరించాడు.

మరోవైపు, వేదాంతశాస్త్రములో మధ్యయుగ శాస్త్రీయ తత్వము మరియు ప్రారంభ ప్రొటెస్టెంట్ల యొక్క నియమాలను అధిగమించే ఒక పాత్రను తర్కమునకు హడ్జ్ ఆమోదించాడు. ఆధునిక శాస్త్రజ్ఞులకు అనుగుణమైన మార్గాల్లో వేదాంతపండితులు తమ క్రమశిక్షణను ఎలా పాటించాలో చెప్పిన ఆయన విధానాలను చూద్దాం. ఆయన క్రమబద్ధ వేదాంతశాస్త్రములోని మొదటి పుస్తకము, ఐదవ భాగములో ఈ మాటలను వ్రాసాడు:

> విజ్ఞాన శాస్త్రజ్ఞుడు ప్రకృతిని అధ్యయనం చేయడానికి కొన్ని పుర్వాలోచనలు కలిగి వస్తాడు.

> అతడు జ్ఞాన అవగాహన యొక్క విశ్వాసనీయతను ఊహిస్తాడు. ... అతడు మానసిక కార్యకలాపాల యొక్క విశ్వాసనీయతను కూడా ఊహించాలి.... అనుభవము ద్వారా నేర్చుకొనబడని ఆ సత్యముల నిశ్చయతపైన కూడా ఆధారపడాలి... ప్రతి పరిణామమునకు ఒక కారణం ఉంటుంది; ఒకే రకమైన పరిస్థితులలో అదే కారణం అదే రకమైన పరిణామాలను ఇస్తుంది.

అతని కాలములో విజ్ఞాన శాస్త్రములు ఎలా అర్థము చేసుకొనబడినవో వివరించిన తరువాత, క్రమబద్ధ వేదాంతపండితులను గూర్చి హడ్జ్ ఒక మాటను చెప్పాడు.

> ...విజ్ఞాన శాస్త్రజ్ఞుడికి ప్రకృతి ఎలాగో వేదాంతపండితుడికి బైబిలు ఆలాగే. అది అతనికి సత్యముల గిడ్డంగి; మరియు బైబిలు బోధించే విషయాలను తెలుసుకొనుటలో ఆయన పద్ధతి, ప్రకృతి బోధించే విషయాలను తెలుసుకొనుటకు ప్రకృతి తత్వవేత్త ఉపయోగించే పద్ధతి ఒకటే.

కాబట్టి ఆయన కాలములోని విజ్ఞానశాస్త్రము ప్రకారము హడ్జ్ హేతువాదము మరియు తర్కము యెడల తన అవగాహనను మార్చుకొనినప్పటికీ, ఒక క్రమబద్ధ వేదాంతపండితునిగా వేదాంతశాస్త్రమును నిర్మించుటకు సాంప్రదాయకమైన హేతువాదము మరియు తర్కమును ప్రాముఖ్యమైన పరికరాలుగా ఆయన చూచిన విధానమును మనము చూడొచ్చు.

మరోవైపు, హడ్జ్ యొక్క *క్రమబద్ధ వేదాంతశాస్త్రము* పై నుండి వచ్చిన వేదాంతశాస్త్రము యొక్క ప్రాధాన్యతలను కూడా అనుసరిస్తుంది. ఆయన క్రమబద్ధ వేదాంతశాస్త్రమును చూచినప్పుడు క్రైస్తవ వేదాంతమునకు ఆయన ఇచ్చిన సారాంశము వెల్లడి అవుతుంది.

అతని *క్రమబద్ధ వేదాంతశాస్త్రము* ఉపోద్ఘాతముతో ఆరంభమై, "దేవుని గూర్చిన శాస్త్రము" అని పేరుపెట్టబడిన ఒకటవ భాగములో కొనసాగుతుంది. అక్కడ ఆయన దేవుని సిద్ధాంతమును గూర్చి చర్చించాడు. "మానవశాస్త్రము"గా పేర్కొనబడిన రెండవ భాగము ప్రాధాన్యతల కొలబద్దలో క్రిందికి మానవత్వము వైపు కొనసాగుతుంది. తరువాత మూడవ భాగము, "రక్షణశాస్త్రము," ఇది క్రీస్తులో దేవుని కార్యము యొక్క అత్యధిక భావనతో ఆరంభమై ప్రజల వ్యక్తిగత జీవితములలో రక్షణను గూర్చిన అనువర్తనను చర్చిస్తుంది, మరియు తరువాత కృప యొక్క ఆచరణాత్మక మార్గములను చర్చిస్తుంది. సాంప్రదాయకమైన క్రమమును అనుసరించి నాలుగవ భాగముమైన "రాకడ శాస్త్రము"తో — అనగా చివరి దినములుతో — అతని వేదాంతశాస్త్రమును ముగించాడు.

కాబట్టి ప్రతి యుగములో, నమ్మకమైన క్రైస్తవులు లేఖనములకు విధేయులై జీవిస్తు, వారు నివసిస్తున్న అన్య సంస్కృతులకు సముచితమైన మార్గాల్లో లేఖన బోధలను వ్యక్తపరచారని కూడా మనము చూడవచ్చు.

క్రైస్తవ వేదాంతశాస్త్రమును వ్యక్తపరచే ఒక ప్రధాన మార్గమును క్రమబద్ధ వేదాంతశాస్త్రము ఎలా అభివృద్ధి చేసినదో మనము ఇప్పటివరకు చూశాము, గనుక ఇప్పుడు మూడవ ప్రధాన అంశమైన క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క విలువలు మరియు ప్రమాదములను మనము చర్చించుదము. రానున్న పాఠములలో ఈ విషయాలను మరింత వివరంగా చర్చిస్తాము. కాబట్టి, ఇప్పుడు కొన్ని విశాలమైన అంశములను మాత్రమే చూద్దాము.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

## విలువలు మరియు ప్రమాదాలు

క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క కొన్ని అనుకూల మరియు ప్రతికూల లక్షణములను చూడాలంటే, ఇతర పాఠములలో వేదాంతశాస్త్ర నిర్మాణమును గూర్చి ఎలా వివరించామో జ్ఞాపకం చేసుకోవాలి. క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుటకుగాను దేవుడు మనకు దయచేసిన మూడు ప్రధాన వనరులను గూర్చి మాట్లాడిన విషయమును మనము జ్ఞాపకము చేసుకోవాలి: లేఖన వివరణ, సమాజంలో పాలుపంపులు మరియు క్రైస్తవ జీవన విధానము. లేఖన వివరణ అనేది ప్రత్యేక ప్రత్యక్షతపై దృష్టి పెట్టినప్పుడు మనము ఉపయోగిస్తాము మరియు అన్ని విషయాలలో దేవుని సాధారణ ప్రత్యక్షతపై దృష్టి పెట్టునప్పుడు ఇతర రెండు వనరులను ఉపయోగిస్తాము. సమాజంలో పాలుపంపులు అనునది సాధారణ ప్రత్యక్షత యొక్క ప్రాముఖ్యమైన కోణమును అందుబాటులో ఉంచుతుంది: ఇతర ప్రజల యొక్క సాక్ష్యము, ప్రత్యేకముగా ఇతర క్రైస్తవుల సాక్ష్యము. క్రైస్తవ జీవనము మన దృష్టిని సాధరణ ప్రత్యక్షత యొక్క ఇతర ముఖ్యమైన కోణముల వైపు ఆకర్షిస్తుంది — క్రీస్తు కొరకు మనము జీవించునప్పుడు కలుగు అనుభవముల ద్వారా నేర్చుకునే విషయాలు, పాపముతో పోరాడి ఆత్మలో నడచుట. దేవుని ప్రజలు ఆయన దర్శనమును తెలుసుకొని మరియు క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుటకుగాను పరిశుద్ధాత్మడు సహాయపడే సాధారణ మార్గాలుగా ఈ మూడు వేదాంతశాస్త్ర వనరులు ఉన్నాయి.

మనకున్న ప్రత్యేక నమ్మకాల యెడల సరైన విశ్వాస స్థాయిలను అంచనా వేయుటకు సహాయపడే విధముగా ఈ ప్రధాన వేదాంతశాస్త్ర వనరులు ఉన్నట్లు మనము జ్ఞాపకము చేసుకుంటాము. లేఖన వివరణ యొక్క సాక్ష్యులుగా, సమాజంలో పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనమనునవి ఒక విషయముతో పొంతనగాను మరియు అనుకూలంగాను ఉన్నప్పుడు ఆ అంశమును గూర్చిన మన నిర్ధారణ మరియు నిశ్చయత యొక్క స్థాయి సాధారణంగా పెరుగుతుంది. అయితే, ఈ సాక్ష్యములు ప్రతికూలంగా మరియు తక్కువ విలువగా ఉన్నప్పుడు ఇవ్వబడిన అంశమును గూర్చిన మన ఒప్పుకోలు మరియు నిశ్చయత స్థాయి సాధారణంగా తగ్గిపోతాయి. లేఖన వివరణ, సమాజంలో పాలుపంపులు మరియు క్రైస్తవ జీవనమను వనరులు క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుటలో ప్రాముఖ్యమైన పాత్రలను వహిస్తున్నాయి గనుక, క్రమబద్ధీకులు ఈ వనరులలో ప్రతిదానిని ఏ విధముగా ఉపయోగిస్తున్నారు అని ప్రశ్నించడము ద్వారా క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క విలువలు మరియు ప్రమాదాలపై కొన్ని ముఖ్యమైన అంచనాలను వేయవచ్చు. దేవుడు ఇచ్చిన మూడు వనరులను ఉపయోగించుటలోగల మన సామర్థ్యమును క్రమబద్ధ వేదాంతశాస్త్రము ఎలా అవరోధిస్తుంది మరియు మెరుగుపరుస్తుంది?

మొదటిగా క్రైస్తవ జీవన విధానమునకు సంబంధించిన క్రమబద్ధతను గూర్చి మాట్లాడదాము; రెండవదిగా, సమాజంలో పాలుపంపులకు సంబంధించిన క్రమబద్ధతను గూర్చి; మరియు మూడవదిగా, లేఖన వివరణకు సంబంధించిన క్రమబద్ధతను గూర్చి మాట్లాడుదము. క్రైస్తవ జీవనముపై క్రమబద్ధత ఎటువంటి అనుకూల మరియు ప్రతికూల ప్రభావములను కలిగియున్నదో మొదట చూద్దాము.

## క్రైస్తవ జీవనము

క్రైస్తవ జీవన విధానమను వనరును గూర్చి అనేక విధాలుగా వివరించవచ్చు మరియు అది ఎలా పనిచేస్తుందో అను విషయముపై తరువాత పాఠములలో వివరంగా చూద్దాము. ఇప్పుడు, క్రైస్తవ జీవనమును గూర్చి క్లుప్తముగా మాట్లాడుదము. మన అధ్యయనములో, క్రైస్తవ జీవనములో మన పవిత్రీకరణ, పరిశుద్ధతలో మన అభివృద్ధిని, మూడు అనుబంధ విషయాలలో మాట్లాడుదము. మనము భావనాత్మక స్థాయిలో, ప్రవర్తనా స్థాయిలో మరియు భావోద్వేగ స్థాయిలో పరిశుద్ధపరచబడాలి. మరోమాటల్లో, మన ఆలోచనలు దేవుని చిత్తప్రకారముగా ఉండాలి. మన పనులు దేవుని చిత్తప్రకారముగా ఉండాలి. మన భావోద్వేగాలు కూడా దేవుని చిత్తప్రకారముగా ఉండాలి. క్రైస్తవ జీవనము యొక్క ఈ మూడు కోణములను ఆర్థోడాక్సి, ఆర్థోప్రాక్సిస్ మరియు ఆర్థోపాతోస్ గా మాట్లాడాము.

క్రైస్తవ జీవనము యొక్క ఈ మూడు కోణముల నుండి ప్రయోజనములను పొందుటలో క్రమబద్ధ వేదాంతశాస్త్రము మన సామర్థ్యమును పెంచే మరియు ఆటంకపరచే క్లిష్టమైన విధానాలు ఇవి. మొదటిగా సానుకూల వైపును చూద్దాము, వేదాంతశాస్త్రమునకు ఒక వనరుగా క్రమబద్ధత క్రైస్తవ జీవన విధానమును ఎలా మెరుగుపరుస్తుంది.

### మెరుగుపరచుట

సానుకూల దృక్పథంలో, క్రమబద్ధ వేదాంతశాస్త్రము ప్రత్యేకముగా సాంప్రదాయ పద్ధతి (ఆర్థోడాక్సి) విషయములో బలమైనదిగా ఉంటుంది. క్రమముగా ఆలోచన చేయు విధానమును అది మనకు కలిగిస్తుంది, అనుదిన జీవితములో మనము ఎదుర్కొనే సమస్యలను సరైన రీతిలో పరిగణించుటకు ఒక సంభావిత ప్రణాళిక. దినదినము క్రీస్తు కొరకు జీవించాలని ప్రయత్నిస్తుండగా, తార్కిక సామరస్యమైన కోణం, దేవుని స్థిరమైన, దృఢమైన దృక్పథం, మనము మరియు మన చుట్టూనున్న ప్రపంచ దృక్పథం నుండి పొందుకొనవలసిన పరిస్థితులను మనము ఎదుర్కొంటాము. అటువంటి వీక్షణలను కనుగొనే అతి ముఖ్యమైన విషయాలలో క్రమబద్ధ వేదాంతశాస్త్రము ఒకటి. మనము కేవలము సంబంధములేని నమ్మకములను కలిగి ఉన్నప్పుడు, మన జీవితమును గూర్చిన ప్రశ్నలకు సమాధానమిచ్చుటకు లేదా దేవునిని గౌరవించు నిర్ణయాలను తీసుకొనుటకు మన పరిస్థితులను మనము అంచనా వేయలేము.

ఒకప్పుడు నా స్నేహితుడిని ఆసుపత్రిలో దర్శించిన విషయం జ్ఞాపకమునకు వస్తుంది. అతడు చాలా అనారోగ్యంగా ఉన్నాడు మరియు ఎక్కువ ప్రార్థన అవసరతలో ఉన్నాడు. కానీ దేవుని సహాయము కొరకు ప్రార్థన చేస్తున్నావా అని నేను అతడిని అడిగినప్పుడు, అతడు "చెయ్యను" అని చెప్పాడు. అతడి సమాధానము నాకు ఆశ్చర్యం కలిగించింది కాబట్టి కారణం ఏమిటో వివరించుమని నేను అతనిని అడిగాను. "నేను దేవుని సార్వభౌమత్వమును నమ్ముతాను. కాబట్టి, ప్రార్థన ఎటువంటి మార్పును కలిగించదని నాకు తెలుసు" అని అతడు జవాబిచ్చాడు.

నా స్నేహితుడికి ఏమైంది? సరే, చాలా విషయాలలో అతడు కొంత క్రైస్తవ వేదాంతశాస్త్రమును గ్రహించి క్రైస్తవ బోధన అంతా అదే అని పరిగణించాడు. దేవుడు చరిత్రపై నియంత్రణను కలిగియున్నాడని అతడు సరిగా అర్థము చేసుకున్నాడు; దేవుడు పరిపూర్ణముగా సార్వభౌముడు. ప్రార్థన యొక్క ఉపయోగము, దేవుడు తన సర్వోన్నతమైన ఉద్దేశాలను నెరవేర్చుటకు ప్రార్థనను ఉపయోగించుకొను

విధానముల వంటి క్రైస్తవ విశ్వాసములోని ఇతర సత్యాలకు ఆ సత్యమును ఎలా అనుసంధానం చేయాలో నా స్నేహితునికి తెలియలేదు.

దేవుని సార్వభౌమత్వము ప్రార్థన అవసరతను తగ్గించదు, కాని వాస్తవానికి అది ప్రార్థనకు తార్కిక ఆధారముగా ఉన్నది. దేవుడు సర్వోన్నతుడు గనుక మనము ప్రార్థిస్తాము. ఆయన నియంత్రణలో ఉన్నాడు గనుక సహాయము కొరకు మనము ఆయనవైపు తిరుగుతాము. దేవుడు నియంత్రణలో లేకపోతే, సహాయము కొరకు మనము వేరే వారి వైపు తిరగాలి. నా స్నేహితుడు ఈ విషయాలు అర్థము చేసుకొనుంటే, క్రమబద్ధ వేదాంతశాస్త్రములో మరింత శిక్షణపొందితే, ప్రార్థన మరియు దేవుని సార్వభౌమత్వమునకు మధ్య సంబంధమును అతడు అర్థము చేసుకొనియుంటే ఆ కష్ట కాలములో తన క్రైస్తవ జీవితమును గడుపుటకు మరింత సిద్ధపడియుండేవాడు.

అదే సమయములో, ఛాందసత్వము అనునది క్రమబద్ధ వేదాంతశాస్త్రమునకు ఎంతటి అనుకూలముగా ఉన్నప్పటికీ, దాని నుండి ఎక్కువగా ఆశిస్తే అది మన క్రైస్తవ జీవమునకు అవరోధముగా ఉండగలదు.

## అవరోధము

క్రమబద్ధ వేదాంతశాస్త్రము మన దృష్టిని క్రైస్తవ విశ్వాసముపై జాగ్రత్తగా హేతుబద్ధమైన ఆలోచనను చేయునట్లు చేస్తుంది మరియు ఇది చాల ప్రాముఖ్యమైనదిగా ఉంది. మన నమ్మకములను తార్కిక వ్యవస్థలో అమర్చుటలో మునిగిపోయి క్రైస్తవ జీవితము యొక్క ఇతర కోణములను, ముఖ్యముగా ఆర్థోప్రాక్సిస్ ను, అనగా మన ప్రవర్తనలను దేవుని చిత్తమునకు అనుగుణంగా చేయుటకు మరియు ఆర్థోపాతోస్ అనగా మన భావోద్వేగములను దేవుని చిత్తమునకు అనుగుణంగా ఉంచుకొనాలను విషయములను నిర్లక్ష్యం చేస్తాము.

ఉదాహరణకు, క్రమబద్ధతలలో ఎక్కువగా మునిగిపోయినవారు క్రైస్తవ విశ్వాసపు అభ్యాసములో మరియు ఆచరణలో తమ దృష్టిని తగ్గించుకుంటారు. ఆరాధన, కృపలో పాలుపొందుట, ఇతరులకు సేవచేయుట, మరియు పరిశుద్ధాత్ముని యొక్క స్పష్టమైన మరియు భావోద్వేగ నడిపింపు వంటి విషయాలను వారు పట్టించుకోరు. క్రైస్తవ జీవన విధానమును సంక్లిష్ట విషయాలకు, సాంప్రదాయ విషయాల వరకు పరిమితం చేసి, క్రైస్తవ జీవితము యొక్క ఎక్కువ ఆచరణాత్మక మరియు వ్యక్తిగత విషయాలను తొలగిస్తారు. హేతుబద్ధమైన క్రమబద్ధ వేదాంతశాస్త్రము ప్రాముఖ్యమైనదే, కాని మన విశ్వాసము కేవలము సిద్ధాంతముల వ్యవస్థ కాదు. అది ఆచరించవలసిన ఆచరణాత్మక విశ్వాసము మరియు కాపాడుకోవలసిన వ్యక్తిగత సంబంధమైయున్నది.

వేదాంత విద్యార్థుల జీవితములలో ఈ సమస్యను నేను ఎన్నిసార్లు చర్చించానో చెప్పలేను. అనేక సంఘములకు సేవకునిగా ఉండుటకు పిలుపులను అందుకొన్న ఒక విద్యార్థి నాకు గుర్తున్నాడు. అతనికి నిర్ణయము తీసుకోవడం తెలియలేదు కాబట్టి చాలా నలిగిపోయాడు. "నేను క్రమబద్ధ వేదాంతశాస్త్రమును ఎక్కువగా చదివాను. కానీ నా జీవితమంతటిలో నేను ఎదుర్కొనే అత్యంత ముఖ్యమైన ఎంపికలలో ఒకదానిని నిర్ణయించుకోవడానికి ఆచరణాత్మక విషయంలో అది నాకు సహాయపడలేదు," అని అతడు నాకు చెప్పాడు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

"పరిశుద్ధాత్ముడు నిన్ను నడిపిస్తున్నాడని నీవు ఎలా భావిస్తున్నావు? ఈ నిర్ణయమును గూర్చి ఉపవాస ప్రార్థనలో ఎక్కువ సమయము గడిపితివా?" అని నేను అతనిని అడిగాను.
"నేనెందుకలా చేయాలి? తార్కికంగాను మరియు క్రమబద్ధముగాను ఈ విషయమును నేను పరిష్కరించాలనుకున్నాను" అని బదులిచ్చాడు.

చాలా సార్లు, ఉత్సాహభరితముగా క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క లక్ష్యాలను హత్తుకొనే క్రైస్తవులు విశ్వాస ఆచరణను మరియు పరిశుద్ధాత్ముని యొక్క వ్యక్తిగత పరిచర్యను నిర్లక్ష్యం చేయడం మొదలుపెడతారు. మరియు ఇది ఫలభరితమైన క్రైస్తవ జీవితమునకు తీవ్ర అవరోధము కలిగిస్తుంది.

క్రైస్తవ జీవనమును గడిపే మన సామర్థ్యమును హెచ్చించుట మరియు తగ్గించుటతో పాటు, సమాజములో పాలుపంపులు మీద కూడా క్రమబద్ధత అనేక అనుకూల మరియు ప్రతికూల ప్రభావములను చూపిస్తుంది. తరువాత పాఠములలో సమాజములో పాలుపంపులను గూర్చి మరింత జాగ్రత్తగా చూద్దాము, కానీ ఇప్పుడు ఈ వేదాంత వనరుల యొక్క ప్రధాన విషయాలను చూద్దాము.

## సమాజములో పాలుపంపులు

సమాజ పాలుపంపులలో మూడు విషయాలు ఉన్నాయని ఆలోచించుట సహాయకరంగా ఉంటుంది: మన క్రైస్తవ వారసత్వం, గతములో పరిశుద్ధాత్మ చేసిన కార్యము, మన వర్తమాన సమాజము, సమకాలీన క్రైస్తవ సమాజములో మరియు మన వ్యక్తిగత నిర్ణయాలలో పరిశుద్ధాత్ముని నడిపింపు, సమాజములో వ్యక్తిగతముగా మనలో పరిశుద్ధాత్ముడు కార్యముచేయు స్థానము. క్రైస్తవులు ఒకరితోనొకరు పాలుపంచుకుంటారు ఎందుకంటే పరిశుద్ధాత్ముడు ప్రపంచములో పరిచర్యను జరిగించుటకు సంఘము కేంద్రముగా ఉందని మనకు తెలుసు. మరియు పరిశుద్ధాత్మతో నింపబడినవారితో సమైక్యముగా మన వేదాంతశాస్త్రమును మనము నిర్మించాలని క్రీస్తు ఆశిస్తున్నాడు.

వారసత్వం, ప్రస్తుత సమాజము మరియు వ్యక్తిగత తీర్పు అను పాలుపంపులకు సంబంధించిన మూడు విధములైన విషయాలను మనస్సులో ఉంచుకొనుట ద్వారా, క్రమబద్ధ వేదాంతశాస్త్రము సమాజ పాలుపంపులను ఎలా మెరుగుపరుస్తుందో మరియు ఎలా అవరోధము కలిగిస్తుందో చూచుటలో మనకు సహాయపడతాయి.

### మెరుగుపరచుట

ఒక వైపు, క్రైస్తవ వారసత్వము మీద దృష్టిని పెట్టుటలో, గతములో క్రైస్తవులు తమ విశ్వాసమును అర్థము చేసుకొని ఎలా జీవించారు అను విషయములలో అది మనకు సహాయపడు విధానము, సమాజము కొరకు క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క గొప్ప విలువలలో ఒకటైయున్నది. గతములో వేదాంతశాస్త్రమును నిర్మించిన గొప్ప స్త్రీపురుషులపై దృష్టిని పెట్టి, క్రీస్తు సంఘమునకు పరిశుద్ధాత్ముడు బోధించిన విషయాల ఆధారంగా క్రమబద్ధీకులు వేదాంతశాస్త్రమును నిర్మించారు. మరియు ఈ కారణముచేత, గతములోని క్రైస్తవ సమాజముతో సంభాషించు మన సామర్థ్యమును ఇది బాగా పెంచగలదు.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

మన కాలంలో, చాలామంది క్రైస్తవులు వేదాంతశాస్త్రమును చాలా వ్యక్తిగతముగా చూస్తారు. ఇతర క్రైస్తవులు విశ్వసించు దానిపై తక్కువ దృష్టి పెట్టి తమకు సత్యమని అనిపించినదానిపై ఎక్కువ శ్రద్ధ చూపించి వేదాంతశాస్త్రమును నిర్మించడమే అత్యధిక వేదాంత లక్ష్యముగా చాలామంది క్రైస్తవులు భావిస్తున్నట్లు కనిపిస్తుంది. మంచిది, వేదాంతశాస్త్రమును మనము సంప్రదించే విషయములో నిజాయితీగా వ్యక్తిగతముగా ఉండాలని క్రీస్తు మనల్ని పిలిచాడు అనగా అది నిజాయితీగా ఉండాలి, మరియు మనము హృదయపూర్వకముగా పాలుపొందాలని ఆయన ఆశిస్తున్నాడు అయితే వేదాంతశాస్త్రమును వ్యక్తిగత ఆలోచనతో మాత్రమే సంప్రదిస్తే వేదాంతశాస్త్రమునకు దేవుడిచ్చిన సంపన్న వనరులలో కొన్నింటిని మనము కోల్పోతాము: అది యుగాలుగా పరిశుద్ధాత్మ చేస్తున్న పని.

కాగా, అప్పుడప్పుడు నేటికాలములో విశ్వాసులు ఇతరులతో సంభాషిస్తున్నప్పుడు అది సాధారణముగా ప్రస్తుత సమాజపు స్థాయిలోనే ఉంటుంది. మన సమకాలీనులు ఇచ్చు ప్రసంగములను మరియు ఉపన్యాసములను వింటాము మరియు పుస్తకాలు చదువుతాము. అయితే, క్రమబద్ధ వేదాంతశాస్త్రము గతములో పరిశుద్ధాత్ముడు సంఘమును నడిపించిన అద్భుత విధానముల వైపు మన దృష్టిని త్రిప్పుతుంది.

ఈ విధముగా సమాజములో పాలుపంపుల విషయములో క్రమబద్ధత మనలను అభివృద్ధి చేస్తుందనడం వాస్తవం, అదే సమయములో, క్రమబద్ధ వేదాంతశాస్త్రము పాలుపంపులకు అవకాశము కలుగజేయు విషయములో మాత్రం పరిమితంగా ఉన్నది.

## అవరోధము

క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము యొక్క సాంప్రదాయిక దృష్టిని మనము అతిగా పరిగణించినప్పుడు, అది మనలన అనౌచిత్యమునకు నడిపిస్తుంది, మరియు పరిశుద్ధాత్ముడు ప్రస్తుత సమాజమునకు బోధించువాటిని మరియు నేడు మన వ్యక్తిగత తీర్పును గూర్చి తెలియజేయు విషయాలను తిరస్కరిస్తుంది. గతములోని వేదాంతశాస్త్రము ఎంత ప్రాముఖ్యమైనప్పటికీ, నేడు సంఘము క్రొత్త సవాళ్లను ఎదుర్కొంటుంది మరియు ఆ సవాళ్లకు ఎలా స్పందించాలో నేడు పరిశుద్ధాత్ముడు ఇంకనూ బోధిస్తూనే ఉన్నాడు.

ఒక ఆదివారపు ఉదయకాలమున నా స్నేహితుని కలిసిన విషయము నాకు జ్ఞాపకమొస్తుంది. అతడు పట్టణములోని మరొక సంఘనకు సభ్యుడుగా ఉన్నాడు, కానీ ఆ దినమున మా సంఘమును దర్శించాడు. కాబట్టి, "నేడు నీవు ఇక్కడ ఎందుకున్నావు? నీవు వేరే సంఘమునకు చెందినవాడవు కావా?" అని అడిగాను.

అతని స్పందన అసలు విషయమును బయలుపరచింది. ఆయన ఇలా చెప్పాడు, "సేవకుడు క్రమబద్ధ వేదాంతశాస్త్రము బోధించేవాడు గనుక నేను నా సంఘమును ప్రేమించేవాడిని. క్రైస్తవులు ఏమి నమ్ముతారో నేను చాలా నేర్చుకున్నాను, కానీ నేను నా సంఘములో సమయం గడిపిన కొలది, జీవితాన్ని కోల్పోతున్నానని అనిపించింది."

క్రైస్తవులు క్రమబద్ధ వేదాంతశాస్త్రమును గూర్చి ఎక్కువ ఉల్లాసపడిపోయినప్పుడు ఈ విధమైన సమస్యే వస్తుంది. వారు వారసత్వముపై ఎక్కువ శ్రద్ధ చూపుతారు గనుక సమకాలీన సమస్యలను ఎలా పరిష్కరించాలో కూడా తెలియకుండా ఉంటారు. ప్రస్తుత సమాజము మరియు వ్యక్తిగత తీర్పు వైపు దృష్టి పెట్టకుండా క్రమబద్ధ వేదాంతశాస్త్రము మనలను అవరోధిస్తుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

క్రైస్తవ జీవనము గడపుట మరియు సమాజములో పాలుపంపులు చేయుట కొరకు క్రమబద్ధ వేదాంతశాస్త్రము మనలను సిద్ధపరుచు విధానమును చూచుట ఎంత ప్రాముఖ్యమో, లేఖనమును వివరించునప్పుడు గణనీయమైన ప్రభావమును చూపుతుందనడం కూడా అంతే ప్రాముఖ్యమైయున్నది.

## లేఖన వివరణ

తరువాత పాఠములలో, లేఖన వివరణను గూర్చి మరింత అన్వేషించుదము, కానీ ఇప్పుడు బైబిలును అనువదించుటలో సంఘమునకు పరిశుద్ధాత్ముడు బోధించిన మార్గాలను చూద్దాము. మూడు ప్రధానమైన వర్గాలుగా వాటిని సంగ్రహించడం సహాయకరంగా ఉంటుంది: సాహిత్య విశ్లేషణ, చారిత్రక విశ్లేషణ మరియు అంశ విశ్లేషణ. ఈ పద్ధతులలో ప్రతిదీ ఒక ప్రత్యేక విషయమును అందిస్తుంది, కానీ ప్రతి ఒక్కటి ఇతర వాటిపై ఆధారపడుతుంది. కావున, వివరణ కొరకు క్రమబద్ధమైన వేదాంతశాస్త్ర విలువలను మరియు పరిమితులను అంచనా వేసినప్పుడు, లేఖనమును అనువదించుటలోగల ఈ మూడు పద్ధతులకు అది ఎలా అనుసంధానం కలిగియున్నదో చూడాలి.

సాహిత్య విశ్లేషణ. సాహిత్య విశ్లేషణ అనగా బైబిలును ప్రధానంగా ఒక చిత్రం లేదా చిత్రలేఖనంలా చూచే వివరణా పద్ధతి; దీనిని మనము కళా సాహిత్య రచనగా చూద్దాము. ఇటీవల దశాబ్దములలో ఇటువంటి వివరణ ఎక్కువగా ఉద్ఘాటించబడింది.

మొత్తంగా చెప్పాలంటే, సాంప్రదాయిక సాహిత్య మార్గాల ద్వారా తమ ప్రేక్షకులను ప్రభావితం చేయడానికి బైబిలు అనునది మానవ రచయితలచే రూపొందించబడిన ఒక పత్రంగా ఉన్నదని సాహిత్య విశ్లేషణ యొక్క భావన. సాహిత్య విశ్లేషణలో ప్రశ్నలకు చాలా ప్రాధాన్యత ఇవ్వబడుతుంది: “మానవ రచయితల యొక్క ఆలోచనలు ఏమిటి?” “ఒక వాక్యభాగము యొక్క సాహిత్య లక్షణములు రచయిత సందేశమును ఎలా తెలియజేస్తున్నాయి?” మరియు “వారి మూల పాఠకులను లేఖనములు ఎలా ప్రభావితం చేసాయి?”

చారిత్రక విశ్లేషణ. చారిత్రక విశ్లేషణ అనేది ఆధునిక కాలపు లక్షణమును కలిగియున్న బైబిలు పద్ధతిగా ఉన్నది, జ్ఞానోదయ కాలముతో ఆరంభమై ఇటీవల దశాబ్దలతో ముగుస్తుంది. ఈ కాలములో, బైబిలు సూచించే చరిత్రను అర్థం చేసుకోవడం బైబిలానుసరమైన వివరణకు కేంద్రమైన అంశముగా ఉన్నది.

చారిత్రక విశ్లేషణ బైబిలును ఒక సాహిత్య చిత్రలేఖనముగా లేదా చిత్తరువుగా కాకుండా, చరిత్రకు ఒక కిటికీగా చూస్తుంది. ఇప్పుడు, చారిత్రక విశ్లేషణ ఇతర పద్ధతులను నిర్లక్ష్యం చేయదు, కానీ దాని ప్రధాన ఉద్దేశం వాక్యభాగము వెనుక ఉన్న చరిత్రను నేర్చుకోవడానికి లేఖనములగుండా చూడడమైయున్నది.

చారిత్రక విశ్లేషణ యొక్క కొన్ని రూపాల్లో, క్రైస్తవులు ఇలాటి వివరణాత్మక ప్రశ్నలను అడుగుతారు: “లేఖనములలో దేవుడు చేసిన ఏ కార్యాలు వివరించబడ్డాయి?” “వాటి యొక్క ప్రాచీన ప్రాముఖ్యత ఏమిటి?” “ఈ దేవుని కార్యాలు ముందు మరియు తరువాత దేవుని ఇతర కార్యాలతో ఎలా అనుసంధానం కలిగియున్నాయి?” చారిత్రక విశ్లేషణ యొక్క ప్రధాన దృష్టి బైబిలు చరిత్రలో ఏమి జరిగిందో పునర్నిర్మించడం మరియు ఆ కాలములోని ప్రజల కొరకు ఆ సంఘటనల యొక్క ప్రాముఖ్యతను అర్థం చేసుకోవడం మీద ఉంటుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

అంశ విశ్లేషణ. లేఖన వివరణకు సంఘము తీసుకొనిన మూడవ ప్రధాన పద్ధతి, బహుశా "అంశ విశ్లేషణ"గా పిలువబడుతుంది. క్రైస్తవులు బైబిలు నుండి వేదాంతమును నిర్వచించే అనేక మార్గాల్లో అంశ విశ్లేషణ ఎల్లప్పుడు ఉంది, కానీ ఆధునిక కాలంలో చారిత్రక విశ్లేషణ వైపుకు మారే ముందు సంఘము యొక్క ఆరంభ శతాబ్దాల్లో అంశ విశ్లేషణ గట్టిగా నొక్కి చెప్పబడింది.

అంశ విశ్లేషణలో లేఖనములను సాహిత్య చిత్రలేఖనాలుగా లేదా చరిత్రకు కిటికీగా చూడముగానీ, ఒక అద్దముగాను, ప్రశ్నలకు స్పందించు మార్గముగాను, అవి బైబిలులో ప్రాముఖ్యమైనవి కాకపోయినప్పటికీ మనకు ప్రాముఖ్యమైన విషయాలు లేదా అంశాలకు స్పందించే విధముగాను చూస్తాము. "మన ఆసక్తులను గూర్చి బైబిలు ఏమి చెప్తుంది?" "అది మన అవసరతలను ఎలా తీర్చుతుంది?" "మనము విలువనిచ్చే అంశములను గూర్చి అది ఏమి మాట్లాడుతుంది?" అను ఇటువంటి ప్రశ్నలను మనము అడుగుతాము. ఈ అంశములు వ్యక్తిగత ఆందోళన నుండి రావచ్చు; మన చుట్టూనున్న సంస్కృతి విషయాల నుండి రావచ్చు లేదా మన సంఘ సమాజముల నుండి రావచ్చు. ఏదిఏమైనప్పటికీ, నమ్మకస్తులైన క్రైస్తవులు తమకు ప్రాముఖ్యమైన అంశములు మరియు ప్రశ్నలను గూర్చి లేఖనములు ఏమి బోధిస్తున్నాయో తెలుసుకోవాలని ఎల్లప్పుడు ఆశపడుతుంటారు.

ఈ మూడు వివరణాత్మకమైన పద్ధతులను మనస్సులో ఉంచుకొని, క్రమబద్ధత లేఖన వివరణను ఎలా మెరుగుపరుస్తుందో మరియు ఎలా అవరోధిస్తుందో చూడగల స్థితిలో మనము ఉన్నాము.

### మెరుగుపరచుట

మొదటిగా, క్రమబద్ధ వేదాంతశాస్త్రము అంశ విశ్లేషణను అభివృద్ధి చేయుటకు చక్కగా అమర్చబడింది. క్రమబద్ధ వేదాంతపండితులు ప్రశ్నించుటకు కొన్ని సంప్రదాయకమైన ప్రశ్నలను, సరిగా అమర్చబడిన అంశముల క్రమమును అందజేస్తుంది.

క్రమబద్ధ వేదాంతశాస్త్రము అంశ విశ్లేషణ యొక్క చాలా ఉపయోగకరమైన రూపమును సూచిస్తుంది. సాంప్రదాయక వేదాంత అంశములను గూర్చి బైబిలంతయు ఏమి చెప్తుందో క్రమబద్ధీకులు దానిని అన్వేషిస్తారు. బైబిలంతటి నుండి వచనములను పోగుచేసి వాటిని సాంప్రదాయ అంశములకు అనుసంధానించునప్పుడు ఈ వచనములన్నిటి మధ్య సంబంధాలను చూస్తారు. వివిధ వచనములను పోగుచేసి మరియు కలిపి మొత్తముగా చూసే ఈ ప్రక్రియ ఒక అంశమును గూర్చి లేఖనములు చెప్పే ఒకే విషయమును తీసుకొని లేఖనములన్నియు ఆ అంశమును గూర్చి అదే విషయమును చెప్తున్నాయను ఆలోచనను చేయకుండా మనకు సహాయపడతాయి. కేవలము ఒక వచనము మాత్రమే దేవుని గూర్చి ఏమి చెప్తుందో తెలుసుకోవడం కాదుగానీ లేఖనమంతయు దేవుని గూర్చి ఏమి చెప్తుందో మనము తెలుసుకోవాలి. మానవత్వము గూర్చి అవన్నియు ఏమి చెప్తున్నాయి? రక్షణ గూర్చి అవన్నియు ఏమి చెప్తున్నాయి? క్రమబద్ధ వేదాంతశాస్త్రము గొప్ప విలువైనది ఏలయనగా ఈ విషయాలపై మరియు ఇతర అనేక కీలక అంశాలపై బైబిలు యొక్క ఉద్దేశములను వెదకుటలో మనకు సహాయబడుతుంది.

### అవరోధము

మరో వైపు, క్రమబద్ధ వేదాంతశాస్త్రము లేఖన వివరణను అవరోధిస్తుంది ఎందుకంటే లేఖనము యొక్క సాహిత్య మరియు చారిత్రక విశ్లేషణపై అది దృష్టి పెట్టదు. వాస్తవానికి, బైబిలును మంచిగా అనువదించే క్రమబద్ధీకులు ఎల్లప్పుడు బైబిలును కొంత మేరకు సాహిత్యముగా మరియు చరిత్రగా



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.

పరిగణిస్తారు. అయినప్పటికీ వారు లేఖనములను సంప్రదించే ప్రధాన మార్గం ఇది కాదు. ఈ కారణముచే, లేఖనములను అనువదించుటలో క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము మన పద్ధతిని అధిగమించినప్పుడు, బైబిలు నుండి మనము నిర్వచించినదానిపై అది కొన్ని పరిమితులను ఉంచుతుంది. మరియు ముందు పాఠములలో మనము చూడబోతున్నట్టు, సాహిత్య మరియు చారిత్రక విశ్లేషణ యొక్క ఆవిష్కరణలు తరచు క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క తీర్మానాలను సర్దుబాటు చేయడానికి మనలను ప్రేరేపిస్తాయి.

కావున సాధారణ పదాల్లో, క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుటలో క్రమబద్ధ వేదాంతశాస్త్రమునకు విలువలు మరియు ప్రమాదములు కూడా ఉన్నాయను విషయమును చూశాము. ఇది క్రైస్తవ జీవన విధానము, సమాజములో పాలుపంపులు మరియు లేఖన వివరణను గూర్చి చెప్పుకోదగ్గ కొన్ని అనుకూల మార్గాలలో వివరించడానికి దోహదపడుతుంది. అయితే ప్రతి వేదాంతశాస్త్ర నిధి యొక్క ముఖ్యమైన పరిణామాల నుండి అది మన దృష్టిని దూరంగా ఉంచుతుంది. క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క విలువలు మరియు ప్రమాదములు రెండింటిని మనస్సులో ఉంచుకోవడమనేది చాలా ప్రాముఖ్యమైయున్నది.

## ముగింపు

ఈ పాఠంలో "క్రమబద్ధమైన వేదాంతశాస్త్రము అనగానేమి?" అను ప్రశ్నను అన్వేషించాము. క్రమబద్ధమైన వేదాంతశాస్త్రమునకు మరియు క్రొత్త నిబంధన వేదాంతశాస్త్రమునకు మధ్య పోలికను మనము చూచాము. సంఘ చరిత్రలో అది ఎలా అభివృద్ధి చెందినదో మనము చూచాము. మరియు క్రమబద్ధ వేదాంతశాస్త్రము యొక్క విలువలను మరియు ప్రమాదములను కొన్నింటిని చూచాము.

క్రమబద్ధ వేదాంతశాస్త్రమును నిర్మించుట ద్వారా మన నమ్మకములను ఒక క్రమములో ఎలా పెట్టాలో నేర్చుకోవడమనేది క్రీస్తు అనుచరులు చేయవలసిన అనేక ప్రాముఖ్య విషయములలో ఒకటి. లేఖనముల బోధను తీసుకొని సంఘము యొక్క సాంప్రదాయముల ప్రకారము తార్కిక క్రమబద్ధతలో అమరిక చేసినప్పుడు దేవునిని గౌరవించు పరిపూర్ణ క్రైస్తవ వేదాంతశాస్త్రమును నిర్మించుటకు మరియు క్రీస్తు సంఘములో మరింత ప్రభావవంతమైన సేవకులుగా ఉండుటకు అది మనకు సహాయపడుతుంది.



వీడియోలు, అధ్యయన మార్గదర్శిలు, మరియు ఇతర నిధుల కొరకు థర్డ్ మిలీనియం మినిస్ట్రీస్ ను thirdmill.org నందు సందర్శించండి.